## రాష్ట్రానికి ద్రోహం చేసిన బిజెపితో

# వైసిపి, టిడిపి రాజీ ఎందుకు?




భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు), ఆంధ్రప్రదేశ్ కమిటి

27-13-3, సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటీ కార్యాలయం, ఆకులవారి వీధి,

గవర్నర్‌పేట, విజయవాడ - 2,

ఫోన్ నెం. 0866 2577202, 9490098433

## రాష్ట్రానికి ద్రోహం చేసిన బిజెపితో

# వైసిపి, టిడిపి రాజీ ఎందుకు?


ప్రచురణ

**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు), ఆంధ్రప్రదేశ్ కమిటి**

27-13-3, సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటీ కార్యాలయం, ఆకులవారి వీధి,

గవర్నర్‌పేట, విజయవాడ - 2.

ఫోన్ నెం. 0866 2577202, 94900 98042

# రాష్ట్ర ప్రజలకు విజ్ఞప్తి

మన రాష్ట్రానికి, దేశానికి కార్మికులకు, కర్షకులకు రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి, లౌకిక విధానానికి తీవ్ర ముప్పుగా పరిణమించిన బిజెపి ఆర్థిక విధానం మతోన్మాదం పై రాష్ట్ర ప్రజలకు తెలియజేసేందుకు 2020 నవంబర్ 7 నుండి 15 వరకు భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ప్రచార ఉద్యమాన్ని నిర్వహిస్తున్నది. ఈ ప్రచార ఉద్యమంలో ప్రజలందరు పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేస్తోంది.

## రాష్ట్రానికి ద్రోహం చేసే బిజెపితో రాజీ ఎందుకు?

రాష్ట్రానికి బిజెపి తీవ్ర ద్రోహం చేసింది. మతోన్మాదం ముందుకుతెచ్చి రాష్ట్ర ప్రజల మధ్య అనైక్యత సృష్టించేందుకు విపరీత ప్రయత్నం చేస్తున్నది. బిజెపి ముప్పు పట్ల ప్రజలను చైతన్య పర్చేందుకు 2020 నవంబర్ 7 నుండి 15 వరకు భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ప్రచారోద్యమాన్ని నిర్వహిస్తోంది. ఈ ప్రచారోద్యమంలో ప్రజలంతా పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేస్తోంది.

ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయాలు ప్రమాదకర ధోరణిలో సాగుతున్నాయి. రాష్ట్రాభివృద్ధిని, ప్రజా ప్రయోజనాలను విస్మరించి, కేంద్రంలోని మతోన్మాద బి.జె.పి ప్రభుత్వ అడుగులకు మడుగులొత్తడానికి వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ, తెలుగుదేశం, జనసేన పార్టీలు పోటీ పడుతున్నాయి. అధికారంలో వున్నా, ప్రతిపక్షంలో వున్నా బి.జె.పి పంచన చేరడంలో వీటి మధ్య తేడా ఏమీ లేదు. తెలుగు ప్రజలు రెండు రాష్ట్రాలుగా చీలిపోవడమే బాధాకరమనుకుంటే, నూతన ఆంధ్రప్రదేశ్ ఏర్పడి గడిచిన ఆరేళ్ళలో అధికార ప్రతిపక్షాలు రాష్ట్రాభివృద్ధిని విస్మరించి వ్యవహరించడం క్షమించరాని నేరం.

2014లో రాష్ట్ర విభజన సందర్భంలో కొత్త రాష్ట్రానికి 'ప్రత్యేక హోదా' ఇస్తామని కేంద్రం చెప్పింది. తాము కేంద్రంలో అధికారానికి వస్తే పది సంవత్సరాలు 'ప్రత్యేక హోదా' కొనసాగిస్తామని ఆనాడు బిజెపి ప్రకటించింది. తర్వాత అధికారానికి వచ్చిన బిజెపి మోడీ నాయకత్వాన ఆరు సంవత్సరాల నుండి పరిపాలిస్తూ వాగ్దాన భంగంజేసి రాష్ట్రానికి ద్రోహం చేసింది. ఆనాడు పార్లమెంటు ఆమోదించిన విభజన చట్టంలో అనేక వాగ్దానాలు చేయబడ్డాయి. రాజధాని నిర్మాణానికి, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి, పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి తగినన్ని నిధులిస్తామని, కడప స్టీలుప్లాంటు, కాకినాడ నూనెశుద్ధి కర్మాగారం, దుగరాజపట్నం ఓడరేవు నిర్మాణం, విశాఖ రైల్వేజోను ఏర్పాటు వంటి అనేక వాగ్దానాలివ్వబడ్డాయి. కేంద్రం కొన్ని వాగ్దానాల నుండి వెనక్కి పోయింది, మరి కొన్నింటికి అరకొర నిధులిచ్చి చేతులు దులుపుకుంది.

బి.జె.పి కేంద్ర ప్రభుత్వం చేసిన వాగ్దానాలను, విభజన చట్ట నిర్ణయాలను కాలరాస్తుంటే తెలుగుదేశం, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలు మిన్నకున్నాయి. అస్త్ర సన్యాసం చేసి, బి.జె.పి ప్రాపు కోసం పాకులాడుతున్నాయి. కొత్త రాష్ట్రంలో మొదటి ఎన్నికల్లో గెల్చి తెలుగుదేశం అధికారానికి వచ్చింది. కేంద్రంలో బి.జె.పి తో అధికారం పంచుకుంది. రాష్ట్రంలో బి.జె.పికి మంత్రివర్గంలో చోటిచ్చింది. ఆ రకంగా బి.జె.పితో చెట్టాపట్టాలేసుకుని తిరిగింది తప్ప రాష్ట్ర ప్రయోజనాలను సాధించేందుకు పూనుకోలేదు. బి.జె.పి ద్రోహాన్ని వెనకేసుకొచ్చి నాలుగు సంవత్సరాలపాటు ప్రజలను మభ్య పెట్టేందుకు పూనుకున్నది. ప్రజాగ్రహానికి గురవుతామని భయపడి ఎన్నికల ముందు బిజెపితో తెగతెంపులు చేసుకున్నప్పటికీ 2019 ఎన్నికల అనంతరం, మళ్ళీ ప్లేటు మార్చి బిజెపికి అనుకూలంగా మారింది. అన్ని సందర్భాలలోనూ సంపూర్ణంగా మద్దతిస్తున్నది. కొత్తగా ఇప్పుడు బిజెపి మత రాజకీయాల రంగును పులుముకునే ప్రయత్నం చేస్తున్నది.

ఆనాడు ప్రతిపక్షంలో వున్న వైఎస్ఆర్ పార్టీ మాట వరసకు స్పెషల్ స్టేటస్ కావాల్సిందే అని ప్రకటనలు చేసినా, కేంద్ర బిజెపి మీద ఈగ వాలనివ్వకుండా వ్యవహరించింది. బిజెపి ద్రోహాన్ని ప్రశ్నించడానికి పూనుకోలేదు. పార్లమెంటులో అన్ని కీలక సందర్భాలలో బిజెపికి మద్దతుగా నిలబడింది. విచిత్రమేమంటే బిజెపి ప్రభుత్వంలో తెలుగుదేశం పార్టీ భాగస్వామిగా వున్నా వైఎస్ఆర్ పార్టీకి ఎటువంటి అభ్యంతరం లేకపోయింది. బిజెపి పట్ల వైఎస్ఆర్ పార్టీకి వున్న భయం లేదా భక్తి, తెలుగుదేశం భాగస్వామ్య ప్రభుత్వాన్ని సమర్థించే స్థితికి ఆ పార్టీని దిగజార్చింది. 2014 ఎన్నికల ముందు ప్రారంభమైన జనసేన...బిజెపి, తెలుగుదేశం సేవతో

మొదలుపెట్టి మధ్యలో స్పెషల్ స్టేటస్ కోసం వామపక్షాలతో కలుస్తున్నామని చెప్పి...2019 ఎన్నికల అనంతరం గురువుని మించిన శిష్యుడి లాగా బిజెపి మత రాజకీయాలను భుజాన వేసుకుని తిరుగుతోంది.

రాజధాని నిర్మాణానికి కేంద్రం ఇస్తానన్న నిధులను రాబట్టుకొని నూతన రాష్ట్రానికి నూతన రాజధానిని సత్వరం పూర్తిచేసుకుందామన్న ధ్యాస అధికార, ప్రతిపక్ష పార్టీలకు ఏ కోశానా కనబడలేదు. కేంద్రంలో భాగస్వామిగా వుండి కూడా అనాడు తెలుగుదేశం అవసరమైన నిధులు రాబట్టలేదు. అమరావతిలో రాజధాని నిర్మాణాన్ని తెలుగుదేశం పెద్ద రియల్ ఎస్టేట్ బిజినెస్‌గా మార్చింది. రాష్ట్ర రాజధానికి అవసరమైన సౌకర్యాల నిర్మాణంపై కేంద్రీకరించి తొందరగా పూర్తిచేయకుండా అసాధ్యమైన, ఊహాజనితమైన ప్రణాళికలను ప్రకటలను చేస్తూ కాలక్షేపం చేసింది. సిపిఐ(ఎం), వామపక్షాలు ఆనాడు చెప్పిన విధంగా నాలుగయిదు వేల ఎకరాల స్థలంలో ప్రభుత్వ పాలనా కేంద్రం నడవడానికి అవసరమైన సౌకర్యాల నిర్మాణంపై దృష్టి పెట్టివుంటే ఈపాటికి రాజధాని పూర్తయి వుండేది. వేలాది మంది రైతు, కూలీలు రోడ్డున పడేవారు కాదు. రియల్ ఎస్టేట్ కుంభకోణాలకు అవకాశం వుండేది కాదు. వైఎస్ఆర్ పార్టీ నేడు ముందుకు తెచ్చిన 'మూడు ముక్కల' సిద్ధాంతానికి అవకాశం ఉండేది కాదు. అమరావతిని రాజధానిగా ప్రతిపక్షంలో వున్నప్పుడు అంగీకరించి ఎన్నికల్లో ప్రజల ముందు చెప్పి అధికారానికి వచ్చిన తర్వాత వైఎస్ఆర్ పార్టీ ప్లేటు మార్చి రాష్ట్ర రాజధానిని వివిధ ప్రాంతాలకు వికేంద్రీకరించాలన్న వివాదాస్పద నిర్ణయం తీసుకున్నది. కొత్త రాష్ట్రాభివృద్ధికి పూర్తి స్థాయి రాజధాని సత్వరం ఏర్పడడం, అందరికి అందుబాటులో వుండే కేంద్రంలో రాజధాని వుండడం అవసరం అన్న అంశం అధికార పార్టీకి పట్టలేదు. అధికార ప్రతిపక్ష పార్టీలు తమ తమ చవకబారు రాజకీయాలతో ఆరేళ్ళయినా రాజధాని ఏర్పడకపోవడం పట్ల ఏ చింతా కనపరచడం లేదు. తగినన్ని నిధులు సమకూర్చకుండా కేంద్ర బిజెపి కాలయాపన చేయడాన్ని విస్మరించి ఈ రెండు పార్టీలు తంపులు పడుతున్నాయి.

రాష్ట్రంలో వ్యక్తిగత నిందలు, దూషణలతో, స్వల్ప విషయాలపై కొట్లాడుకోవడంలో తలమునకలవుతున్న అధికార వైఎస్ఆర్‌సి పార్టీ, ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీలు, మతతత్వ కేంద్ర బిజెపి, దుష్పరిపాలనను భుజాన మోసుకు తిరగడానికి ఒకే మార్గంలో పోవడానికి పోటీ పడుతున్నాయి. కేంద్రం కార్మిక హక్కులు కాలరాస్తూ నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకు వచ్చింది. వీటిని రెండు పార్టీలూ సమర్థించాయి.

రైతాంగం, ముఖ్యంగా పేద మధ్య తరగతి రైతాంగాన్ని దెబ్బ తీసే రైతాంగ చట్టాలకు రెండు పార్టీలు కళ్లు మూసుకుని మద్దతు ఇచ్చాయి. ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా ప్రవేటు సంస్థలకు అప్పగించే ప్రతిపాదనలను రెండు పార్టీలూ ఆలింగనం చేసుకున్నాయి. స్టీల్ ప్లాంటు, రక్షణ సంస్థలు, బ్యాంకులు, ఇన్సూరెన్సు, రైల్వే వంటివి ప్రైవేటు పరం కావడానికి రెండూ తలాడించాయి. ఈ చర్యలు దేశ స్వావలంబనకు, బలహీన వర్గాల రిజర్వేషన్లకు చావు దెబ్బ కొట్టబోతున్నా వీటికి పట్టలేదు. గిరిజనుల, అటవీ హక్కులను కాలరాసే కొత్త పర్యావరణ అంచనా విధానాన్ని అంగీకరించాయి. బలహీన వర్గాలకు విద్యను దూరం చేసే నూతన విధానాన్ని ఆహ్వానించాయి. రాష్ట్రంలోని 25 లక్షల మంది బోర్‌వెల్ రైతులు పొందుతున్న ఉచిత విద్యుత్‌కు, సామాన్య వినియోగదార్లు అనుభవిస్తున్న క్రాస్ సబ్సిడీ పద్ధతికి మంగళం పాడే కొత్త విద్యుత్ చట్టాన్ని సమర్థించాయి. ఈ చట్టాన్ని వ్యతిరేకించకపోవడం అటుంచి, దేశంలో అందరికంటే ముందుగా మీటర్లు బిగించడానికి వైఎస్ఆర్‌సిపి ప్రభుత్వం పూనుకోవడం బిజెపిని సంతృప్తి పరచడానికి ఎంత దూరమైనా వెళ్తుందని స్పష్టం జేస్తున్నది. కరోనా విపత్తును ఎదుర్కోవడంలో కేంద్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైనా, ఆర్థిక మాంద్యంలో సామాన్యుల జీవితం ఛిన్నాభిన్నమైనా, రాష్ట్రాలకు ఇవ్వాల్సిన జిఎస్‌టి బకాయిలు చెల్లించకపోయినా, 370వ అధికరణాన్ని రద్దు చేసి, పౌరసత్వ చట్టానికి సవరణలను తెచ్చి మైనార్టీలపై లౌకిక విలువలపై దాడి చేస్తున్నా అధికార, ప్రతిపక్ష పార్టీలు నోరు మెదపడం లేదు. బిజెపి పాలనలో దళితులు, మహిళలు, మైనారిటీలపై అత్యాచారాలు, దాడులు పెరుగుతున్నా మత వైషమ్యాలు రెచ్చగొట్టే యత్నాలు జరుగుతున్నా ప్రజాస్వామ్య హక్కులకు భంగం వాటిల్లుతున్నా వీటికి పట్టలేదు.

అధికారాన్ని చేపట్టిన తర్వాతనైనా రాష్ట్ర ప్రయోజనాలు, ప్రజా ప్రయోజనాలకు అనుగుణంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ వ్యవహరించడంలేదు. రాష్ట్రాల అధికారాలను కాలరాస్తుంటే ప్రశ్నిస్తున్న ఇతర రాష్ట్ర ప్రభుత్వాలతో ఐక్యంగా వ్యవహరించడం లేదు. నవరత్నాల పేరుతో తాను అమలుచేస్తున్న తాత్కాలిక ఉపశమన చర్యలే సరిపోతాయని ప్రభుత్వం భ్రమలో వున్నట్లుంది. ప్రజలకు ఉపశమనం కల్పించే కొన్ని పథకాల అమలు అవసరమే. కాని ప్రజలు సొంత కాళ్ల పైన ఆత్మ గౌరవంతో బతకాలంటే అవి చాలవు. కార్మికులు, ఉద్యోగులకు ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు, జీతాల చెల్లింపు అవసరం. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని పట్టణాలకు విస్తరించడం, నిరుద్యోగులకు భృతి ఇవ్వడం, వ్యవసాయ కార్మికులకు కనీస వేతనం చెల్లింపు, పేదలకు గృహ కల్పన, ప్రజారోగ్యం, విద్యా సదుపాయాల మెరుగుదల, కౌలుదార్లకు

రక్షణ–పరపతి ఏర్పాటు, ఆదివాసులకు–అటవీ హక్కులకు రక్షణ, విద్యుత్ చట్ట సవరణల అమలు నిరాకరణ, ఇతర రాష్ట్రాలతో కలిసి సమాఖ్య విధానాన్ని రక్షించడం, మతతత్వ శక్తులను నిరోధించడం చెయ్యాలి. ఈ అంశాలపై ఎన్నికల్లో చేసిన వాగ్దానాలనైనా అమలు చేయాలి. కాని రాష్ట్ర ప్రభుత్వం వాటిని మరచిపోయింది.

రాష్ట్రంలో తెలుగుదేశం, వైఎస్ఆర్‌సిపి, జనసేనలు తెలుగు ప్రజల ఆత్మాభిమానం, ఆత్మగౌరవం గురించి మాట్లాడుతుంటాయి. 'మాట తప్పం, మడమ తిప్పం' అని ప్రగల్భాలు పలుకుతుంటాయి. కాని దురదృష్టం ఏమిటంటే నేడు ఈ పక్షాలన్నీ కేంద్ర బిజెపి ప్రభుత్వ గుప్పెట్లో తోలు బమ్మలాట రాజకీయాలను ఆడడానికి ఏ మాత్రం సిగ్గు పడడం లేదు.

ఈ పరిస్థితి రాష్ట్ర రాజకీయాల్లో ఆందోళనకరమైన అంశం. అధికార, ప్రతిపక్ష ప్రాంతీయ పార్టీలు బిజెపి ప్రమాదాన్ని ఉపేక్షిస్తున్నాయి. రాష్ట్రానికి, రాష్ట్ర ప్రజలకు బిజెపి చేస్తున్న ద్రోహాన్ని ఎండగట్టకుండా, ఎదుర్కోకుండా దానికి కాళ్ళు తెస్తున్నాయి. ఈ పార్టీల అవకాశవాదాన్ని వినియోగించుకుని రాష్ట్రంలో బలం పుంజుకోవాలని బిజెపి కలలు కంటున్నది. ఈమధ్య రాష్ట్రాన్ని సందర్శించిన ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భగవత్ తమ సంస్థను రాష్ట్రంలో విస్తరించాలని పిలుపునిచ్చారు. ఈ ప్రమాదాన్ని లౌకిక పార్టీలుగా చెప్పుకుంటున్న తెలుగుదేశం, వైఎస్ఆర్‌సిపి, జనసేన పార్టీలు పట్టించుకోకుండా వదిలేస్తే వామపక్షాలు తమ శక్తి మేరకు బిజెపి సంఘపరివార్ ప్రమాదకర విధానాలను ఎదిరించి పోరాడుతున్నాయి. రాష్ట్రాభివృద్ధికి అవసరమైన ప్రత్యేక హోదా అమలు గురించి ఆందోళనలు చేస్తున్నాయి. కరోనా విపత్తు, ఆర్థిక మాంద్యం వలన ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి జేస్తున్నాయి.

ఇప్పటి వరకు సంఘపరివార్, బిజెపి దుష్కృత్యాలకు మన రాష్ట్రం దూరంగా ఉంది. మనం ఉపేక్షిస్తే ఈ పరిస్థితి ఇలాగే ఉంటుందనుకోలేం. అంతర్వేదిలో దేవాలయ రథాన్ని దుండగులు దహనం చేసిన ఘటనను ఉపయోగించుకుని రాష్ట్ర వ్యాప్తంగా మత విద్వేషాన్ని రెచ్చగొట్టేందుకు బిజెపి, ఆర్ఎస్ఎస్‌లు చేసిన ప్రయత్నం ఆ ప్రమాదం గురించి హెచ్చరిస్తున్నది. బిజెపితో అంటకాగుతున్న పార్టీలు మతతత్వ శక్తులను ప్రతిఘటించి రాష్ట్రాభివృద్ధిని, ప్రజల ప్రయోజనాలను రక్షిస్తాయని అనుకోలేం. ఇందుకు వామపక్షాలు, అభ్యుదయ లౌకికవాదులు, ప్రజా, సామాజిక సంస్థలు సమైక్యంగా పూనుకోవాలి. ఇదే మన ముందున్న మార్గం.

## రైల్వేలు కార్పొరేట్‌కు

మన వారణాసి రైల్వే డీజిల్ లోకోమోటివ్ యూనిట్‌లో సంవత్సరానికి 330 రైలు ఇంజిన్లు ఉత్పత్తి అవుతున్నాయి. ఈ యూనిట్ సామర్థ్యం పెంచితే మనకు కావలసినన్ని రైల్ ఇంజన్లు ఉప్పత్తి అవుతాయి. యువతకు ఉద్యోగాలు లభిస్తాయి. కానీ మోడీ ప్రభుత్వం ఈ పని చేయకుండా అమెరికాకు చెందిన జనరల్ ఎలక్ట్రిక్స్ నుండి 1000 ఇంజిన్లు కొని దిగుమతి చేసుకోవడం ఏ విధమైన స్వావలంబన? ఫలితంగా వారణాసి లోకోమోటివ్ యూనిట్‌ను మూసివేయడం, మన ఉపాధిని దెబ్బతీయడం, అమెరికాలో ఉపాధిని పెంచడం, మన డబ్బు అమెరికాకు ప్రవహింపజేయడం, రైలింజన్లకోసం అమెరికా మీద ఆధారపడడం మన దేశ ప్రయోజనానికి నష్టం. అమెరికా ప్రయోజనాలకు అనుగుణంగా ఉంది. పరాధీనమవడం కూడా మోడీ ఆత్మనిర్భర భారత్‌లో భాగమా?

స్వాతంత్ర్యానికి పూర్వం అనేక ప్రయివేటు కంపెనీలు వేర్వేరు ప్రాంతాల్లో విడివిడిగా రైల్వేలను నడిపేవి. స్వాతంత్ర్యానంతరం మొత్తం రైల్వేలను భారత ప్రభుత్వమే స్వాధీనం చేసుకొని ఒక్కటిగా నడుపుతున్నది. ప్రజల పన్నులతో విశాలమైన రైల్వే వ్యవస్థను నిర్మించింది. అతి తక్కువ ఛార్జీలతో నిర్వహిస్తున్నది. పేద ప్రజల ప్రయాణానికి ఒక ప్రధానమైన సాధనంగా రైల్వేలు ఉన్నాయి. మోడీ ప్రభుత్వం రైల్వేలను కార్పొరేట్లకు అప్పజెప్పి పేద ప్రజలపై తీవ్రమైన దెబ్బతీస్తున్నది. వందకు పైగా రైళ్లను ప్రయివేటుకు ధారాదత్తం చేసింది. రాజధాని, సూపర్‌ఫాస్ట్, ఎక్స్‌ప్రెస్ రైళ్లలో స్లీపర్, జనరల్ బోగీలు తీసేస్తున్నారు. మొత్తం ఏసి బోగీలే ఉంటాయి. అంత ధరపెట్టి పేదలు రైలు ఎక్కలేరు. 362 పాసింజర్ ట్రైన్లు ఎక్స్‌ప్రెస్ రైళ్ళుగా మార్చేశారు. వాటి చార్జీలు పెరుగుతాయి. పాసింజర్లు అగే స్టేషన్లు కుదించేస్తారు. రైల్వే భూములను, ఆస్తులను 99 ఏళ్ల లీజుపేరుతో కార్పొరేట్లకు ఇచ్చేస్తున్నాడు. ప్రధానమైన స్టేషన్లన్నీ నిర్వహన బాధ్యతలు ప్రయివేటుకు అప్పజెప్పేస్తున్నారు. ఎయిర్‌పోర్టుల్లో భారీ టికెట్టు పెట్టి దోచేస్తున్నట్టే రైల్వే స్టేషన్‌లోకి ప్రవేశించాలంటే భారీ మొత్తంలో చెల్లించాల్సిందే. రైలు టికెట్ చార్జీల విషయంలో రెగ్యులేటరీ కమిషన్ పెట్టి ప్రభుత్వం తప్పుకుంటున్నది. ఇక కార్పొరేట్లకు అనుగుణంగా ఛార్జీల నిర్ణయం జరుగుతుంది. ప్రజల సొత్తుపై కార్పొరేట్ లాభాలకు బాటలు వేశారు నరేంద్ర మోడీ.

## ఒంటె - గుడారం కథే

ఒంటెను గుడారంలో తలపెట్టనిస్తే క్రమంగా ఆక్రమించి యజమానిని

తరిమేసిన కథ విన్నాం. ప్రైవేట్ కంపెనీలు ప్రవేశిస్తే రైల్వేలో అదే జరుగుతుంది. ఎవరికైనా అనుమానం ఉంటే టెలికంలో ఏమి జరిగిందో ఒకసారి చూడండి. మొదట కేంద్ర ప్రభుత్వం నుండి వేరుచేసి బిఎస్ఎన్ఎల్ గా మార్చారు. తరువాత ప్రైవేట్ మొబైల్ ఆపరేటర్లను అనుమతించారు. వాటికి ప్రభుత్వ బ్యాంకుల నుండి అప్పులిచ్చారు. మోడీయే స్వయంగా 'జియో'కి బ్రాండ్ అంబాసిడర్గా పని చేసి దాని పెరుగుదలకు సహకరించారు. బిఎస్ఎన్ఎల్ కు 4జీ టెక్నాలజీ ఇవ్వకుండా మోడీ ప్రభుత్వమే అడ్డుకుంది. చివరకు సిగ్నల్ టవర్లు కూడా నిర్మించుకునేందుకు మోడీ ప్రభుత్వం అంగీకరించ లేదు. ఏ హామీ లేకుండా వేల కోట్లు ప్రైవేట్ కంపెనీలకు అప్పు ఇచ్చిన బ్యాంకులు రూ.30లక్షల కోట్ల ఆస్తి గల బిఎస్ఎన్ఎల్ కు 10వేల కోట్లు అప్పు ఇవ్వనివ్వలేదు. ప్రైవేటు వాళ్ళతో కలిసి ప్రభుత్వమే బిఎస్ఎన్ఎల్ను నాశనం చేసింది. ప్రైవేట్ కంపెనీలు ప్రవేశించిన ప్రతి ప్రభుత్వ రంగంలో ఇదే జరిగింది. రైల్వేలో కూడా అదే జరుగుతుంది

## ప్రజల పక్షాన నిలిచేది ప్రభుత్వ రంగమే

మన దేశంలో కరోనా వైద్యం చేస్తున్నది ప్రభుత్వ ఆసుపత్రులే. ప్రైవేటు ఆసుపత్రులు మొదట పలాయనం చిత్తగించాయి. కార్పొరేట్ ఆసుపత్రులు వైద్యం చేసినా రోగులను దోచేస్తున్నాయి. అమెరికాలో మొత్తం ప్రైవేటు వైద్యం కావడంతో దారుణ పరిస్థితి ఎదుర్కొంటోంది. కానీ చైనా, క్యూబా, వియత్నాం, ఉత్తర కొరియా వంటి సోషలిస్టు దేశాల్లో వైద్యం ప్రభుత్వం చేతిలో ఉన్నందున కారోనాను అదుపులో పెట్టగలిగాయి. మోడీ వలస కార్మికులను ఆకలితో మలమల మాడ్చి, ఏడిపించి, నడిపించి అష్టకష్టాలు పాల్జేసారు. చివరికి ప్రభుత్వ రంగ సంస్థ అయిన రైల్వేయే వలస కార్మికులను ఇంటికి చేర్చింది. రైళ్లు ప్రయివేటు పరమైతే ఆ పని చేస్తాయా?

## ఎల్ఐసి, బ్యాంకులపై దాడి

బ్రిటిష్ పాలనలో బ్యాంకులు, ఇన్సూరెన్స్ అంతా ప్రైవేట్ వారివే. ప్రజల డబ్బు తినేసి బోర్డులు తిప్పేసేవి. ప్రజలను మోసం చేసేవి. స్వాతంత్ర్యానంతరం బ్యాంకులు, ఇన్సూరెన్స్ ను ప్రభుత్వం స్వాధీనం చేసుకున్నది. ప్రజల డబ్బుకు భద్రత ఏర్పడింది. ఉద్యోగులు, కార్మికులకు ఉద్యోగ భద్రత వచ్చింది.

ఎల్ఐసి ప్రజల వద్ద పాలసీలు సేకరించి ప్రభుత్వాలకు రూ.31 లక్షల కోట్లు పెట్టుబడులు ఇచ్చింది. రూ.5 కోట్ల ప్రభుత్వ పెట్టుబడికి ఇంత వరకూ రూ.26 వేల కోట్లు డివిడెండ్ ఇచ్చింది. పన్నుల రూపంలో ప్రభుత్వానికి లక్షల కోట్లు చెల్లించింది.

దీని వల్ల ప్రభుత్వాలు అనేక ప్రజాసంక్షేమ కార్యక్రమాలు చేపట్టగలిగాయి. 98 శాతం క్లైములు సెటిల్ చేసి ఎల్ఐసి ప్రపంచంలో నెంబర్ వన్‌గా నిలిచింది. అటువంటి ఎల్ఐసిని ప్రయివేటుపరం చేయడం, అదీ విదేశీ కంపెనీలకు అవకాశం ఇవ్వడం దేశద్రోహంగాక ఆత్మనిర్భర్ అవుతుందా?

ప్రైవేటు బ్యాంకులను జాతీయం చేసిన తరువాత ప్రజల డిపాజిట్ల డబ్బంతా ప్రభుత్వ బ్యాంకులకు చేరింది. బ్యాంకుల్లో డబ్బంతా ప్రభుత్వమే ప్రజా ప్రయోజనాల కోసం కేటాయిస్తుంది. భారత దేశ ఆర్థిక వ్యవస్థకు బలంగా నిలబడింది. ప్రైవేటు బ్యాంకుల్లో ధనం ప్రభుత్వం ప్రజా ప్రయోజనాల కోసం వినియోగించుకోగలదా? బడా కార్పొరేట్లకు ప్రభుత్వ బ్యాంకుల నుండి అప్పులిప్పించిన వాళ్ళు ఎగ్గొట్టిన రుణాలు ప్రభుత్వం మాఫీ చేసి ప్రభుత్వ రంగ బ్యాంకులను ధ్వంసం చేస్తున్నది. మోడీ ఆరేళ్ళ పాలనలో రూ.6 లక్షల కోట్ల కార్పొరేట్ రుణాలను మాఫీ చేశారు.

మోడీ ప్రభుత్వం బొగ్గు, బాక్సైట్, ఇనుప ఖనిజం, గ్యాస్, ఆయిలుతో సహా మొత్తం ప్రకృతి వనరులను అంతరిక్షం, పోర్టులు, విమానయానాలు, రైల్, రోడ్డు, టెలికం వంటి మౌలిక సదుపాయాలను  బ్యాంకులు, ఇన్సూరెన్స్ వంటి ఆర్థిక సంస్థలను చివరికి రక్షణ రంగాన్ని కూడా విదేశీ పెట్టుబడిదారులకు ఇచ్చేస్తే ఇక స్వావలంబన ఎక్కడ? మోడీ కార్పొరేట్ అనుకూల విధానాల వల్ల దేశంలో పట్టుమని పది మంది లక్షల కోట్లకు పడగలెత్తారు. విస్తారమైన ప్రజానీకం రోజురోజుకూ దారిద్ర్యంలోకి వెళ్లిపోతున్నది. మన దేశం స్వాతంత్ర్యం కోసం ఎందుకు పోరాడింది? అంబానీలు, అదానీల కోసమా? అశేష ప్రజల కోసమా?

## ఆత్మ నిర్భర్ భారత్ కాదు.. ఆత్మ సమర్పణ

మన దేశ అవసరాలకు 126 రాఫెల్ యుద్ధ విమానాలు కొనాలని ఫ్రాన్స్‌కు చెందిన 'దసాల్ట్' కంపెనీతో గతంలో మన్మోహన్ ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. ఆ ఒప్పందం ప్రకారం అక్కడే పూర్తిగా తయారైన 18 విమానాలు కొంటారు. మిగిలిన 108 విమానాలు మన ప్రభుత్వ రంగ సంస్థ హిందూస్తాన్ ఏరోనాటిక్స్‌లో తయారు చేస్తారు. రాఫెల్ యుద్ధవిమానాలు తయారు చేసే టెక్నాలజీ భారత్‌కు బదిలీ చేస్తారు. మోడీ ఆ ఒప్పందాన్ని రద్దు చేశారు. విమానాల సంఖ్యను 36కు తగ్గిచారు. అన్నీ ఫ్రాన్స్ లోనే తయారు చేసినవే కొనే ఒప్పందం చేశారు. పాత ఒప్పందంలో చెల్లించాల్సిన సొమ్మునే 36 విమానాలకు చెల్లించాలి. టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్ చేసే నిబంధన లేదు. అంటే ఎన్ని విమానాలైనా ఫ్రాన్స్ నుండే కొనాలి. మన దేశంలో తయారు చేసుకునే

అవకాశం లేదు. మన దేశ సైనిక, యుద్ధ అవసరాలకు ఉత్పత్తి చేసే 42 ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలు మూసివేతకు రంగం సిద్దం చేసింది. అవే సరుకులు అమెరికా నుండి దిగుమతి చేసుకునేందుకు ఒప్పందం చేస్తున్నది. ఇది ఆత్మనిర్భర భారతా? లేకా ఆత్మ సమర్పణ భారతా?

## కార్పొరేట్ల విషకౌగిట్లోకి వ్యవసాయం

"ప్రస్తుతం మార్కెట్లో ఉన్న చిల్లర వ్యాపారులను తొలగించాలి. పంటంతా మార్కెట్ శక్తుల కైవసం కావాలి. మార్కెట్ అంతా కార్పొరేట్ చేతిలో ఉండాలి. నిత్యావసరాల నిల్వలపై ఆంక్షలు ఎత్తివేయాలి. ధరలపై నియంత్రణ ఉండకూడదు. రైతు పంటకు ప్రభుత్వ మద్దతు ధర ఉండకూడదు. సర్వం మార్కెట్ శక్తుల ఇష్టారాజ్యానికి వదిలేయాలి. ప్రభుత్వ నియంత్రణలు ఉండకూడదు. మార్కెట్ శక్తులకు ఏమి కావాలో అది చేయడమే ప్రభుత్వ బాధ్యత"..... ఇదే అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి చిరకాల డిమాండ్. దేశీయ బడాపెట్టుబడి కూడా అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడితో షరీకైన నేపథ్యంలో మోడీ ప్రభుత్వం వాళ్ళ కోరికను తీర్చేలా వ్యవసాయ విధానం ప్రకటించింది. రైతులను ఉద్ధరించడానికే వ్యవసాయ విధానమని మోడీ చెప్పడం పెద్ద అబద్ధం.

## రైతు కార్పొరేట్ బందీ

మోడీ కాంట్రాక్టు వ్యవసాయానికి చట్టబద్ధత కల్పించారు. రైతుతో కార్పొరేట్లు ఒప్పందాలు చేసుకుంటారు. కార్పొరేట్లు చెప్పిన పంటే రైతు వేయాలి. పండిన పంటనంతా కంపెనీకి ఇచ్చేయాలి. కార్పొరేట్ కంపెనీ ఇచ్చింది పుచ్చుకోవాలి. పండించింది కంపెనీ తీసుకోకపోయినా, ధర ఇవ్వక పోయినా రైతు ఆర్‌డిఓకు, కలెక్టరుకు ఫిర్యాదు చేసుకోవాలి. మోడీ మిత్రులైన కార్పొరేట్లను పాపం కలెక్టర్లు మాత్రం ఏమి చేయగలరు? జరిగిన అన్యాయానికి రైతులు బలవుతారు. రైతు తన భూమిలో తానే పండించిన పంటపై హక్కు ఉండదు. తన భూమిలో ఏమి పండించాలో నిర్ణయించలేడు. అంతా కార్పొరేట్ ఇష్ట ప్రకారం నడుచుకోవాలి. అప్పుడు రైతు స్వేచ్ఛ కోల్పోయి కార్పొరేట్ బందీ అవుతాడు.

## బ్లాక్ మార్కెట్‌కు చట్టబద్ధత

రైతు పంట ఎక్కడైనా, ఎవరికైనా అమ్ముకోవడానికి మోడీ చేసిన మరో చట్టం అవకాశమిస్తోంది. ఇప్పుడు రైతు మార్కెట్ యార్డులో అమ్ముతున్నాడు. మోడీ చట్టం చేశారు గనుక ఇకపై ఢిల్లీ, ముంబై, చెన్నై, కోల్‌కతా వీధుల్లో అమ్ముకొగలడా?

రైతును, దేశ ప్రజలను మోసం చేయడానికి గాక మోడీ మాటలు నమ్మతగినవా? వాస్తవం ఏమంటే రిలయెన్స్, వాల్ మార్ట్ వంటి కార్పొరేట్ కంపెనీలు మొత్తం సరుకు పట్టుకుపోయేందుకు ఇది లైసెన్స్. కార్పొరేట్లు ఎంతైనా నిల్వ చేసుకునే విధంగా మోడీ ప్రభుత్వం నిత్యావసర సరుకుల చట్టానికి సవరణ చేసింది. దీనవల్ల బడావ్యాపారులు సరుకును బ్లాక్ చేసి, కృత్రిమ కొరత సృష్టించి ఎక్కువ ధరకు అమ్ముకుంటారు. ఈ చట్ట సవరణతో బ్లాక్‌మార్కెట్‌ను ప్రభుత్వం చట్టబద్ధం చేసింది.

రైతు చట్టసవరణలతో ప్రభుత్వం రైతులకు కనీస మద్దతు ధర ఇచ్చే బాధ్యత నుండి తప్పుకుంటోంది. రైతు నుండి ప్రభుత్వం కొనుగోలు చేయదు. కానీ మోడీ కనీస మద్దతు ధర ఉంటుందని చెప్తున్నారు. చట్టంలో ఆ ముక్కే రాయమంటే రాయడం లేదు. నన్ను నమ్మండి అని మాత్రం అంటున్నారు. ఇంతవరకూ మోడీ చెప్పిన ఒక్క మాటకైనా కట్టుబడ్డారా? ఎలా నమ్మాలి? వ్యవసాయోత్పత్తులను రాష్ట్రాలు, జిల్లాల మధ్య రవాణాచేయడానికి గతంలో ఉన్న ఆంక్షలను మోడీ ప్రభుత్వం ఎత్తివేసింది. మార్కెట్ యార్డుల బయట ఎటువంటి సెస్సు కట్టకుండా కార్పొరేట్ వ్యాపారులు సరుకు కొనుక్కుపోవచ్చు. కార్పొరేట్ల కోసం చేస్తున్న చట్టాలు ఇవి. రైతుకు శఠగోపం పెట్టేవి.

## రైతు, వినియోగదారుడూ లూటీ

కాంట్రాక్టు వ్యవసాయం పేరుతో మొత్తం పంట కార్పొరేట్లుకు చేరిపోతుంది. రైతు దేశమంతా అమ్ముకోవచ్చు అనే చట్టంతో కార్పొరేట్లు దేశమంతటా సరుకు పోగేసు కోవచ్చు. నిత్యావసర వస్తువుల చట్ట సవరణతో ఎంతైనా నిల్వచేసుకోవచ్చు. దీనివల్ల సరుకంతా కార్పొరేట్లు దిబ్బవేసి దానిపై కూర్చొని ధరలు నిర్ణయించే శక్తి పొందుతారు. ఇక కార్పొరేట్ల ఇష్టమే. రైతుకు ఇచ్చే ధర, వినియోగదారులకు అమ్మే ధర రెంటినీ మోడీ వారి చేతుల్లోనే పెట్టేశారు. జనం రక్తం తాగే లైసెన్సుని కార్పొరేట్లుకు ఇచ్చేశారు. బడావ్యాపారులకు దయాదాక్షిన్యాలు ఉండవు. వాళ్లకు మన దేశం, మన ప్రజలు అనే సెంటిమెంట్ ఉండదు. దోచుకొగలిగినది దోచుకోవడమే. విదేశాల్లో ధర వస్తే మన ప్రజలను ఆకలికి గురి చేసి ఎగుమతి చేస్తారు. ఇక్కడ ధరలు పడగొట్టేందుకు విదేశాల నుండి దిగుమతి చేస్తారు. రైతును, ప్రజలను లూటీ చేస్తారు. మోసం వీళ్లకు వెన్నతో పెట్టిన విద్య. 'జియో' ఉచితమని చెప్పి ప్రారంభించిన అంబానీ చేసింది ఏమిటి? మొదట ఉచితం తరువాత దంపుడే.!

## ఫెడరల్ వ్యవస్థకు తూట్లు

అనేక బలమైన జాతులు గల మన దేశం ఒకటిగా ఉండాలంటే ఆ జాతుల ప్రయోజనాలు దేశంలో రక్షించ బడతాయి, గౌరవించ బడతాయని ఆ ప్రజలకు విశ్వాసం ఉండాలి. అంతే తప్ప ఈ దేశంలో ఉన్నారు గనుక కేంద్రం పెత్తనం అంగీకరించాలి అనే ధోరణి ఐక్యతను కాపాడలేదు. అందువలనే రాజ్యాంగ నిర్మాతలు ఏ జాతికి ఆ జాతి తనను తాను పరిపాలించుకుని దేశంలో భాగంగా ఉండే విధంగా రాజ్యాంగాన్ని రూపొందించారు. కేంద్రానికి, రాష్ట్రాలకు వేరు వేరు ప్రభుత్వాల ఏర్పాటుతో పాటు హక్కులు కూడా విభజించారు. ఉమ్మడిగా కొన్ని హక్కులు పెట్టారు. కేంద్రం పెత్తనమే తప్ప రాష్ట్రాలకు హక్కులు, అధికారాలు ఉండకూడదని ఆర్ఎస్ఎస్ సిద్ధాంతం చెబుతోంది. మతోన్మాదులకు ఆధిపత్యమే తప్ప ప్రజాస్వామ్యం అంగీకారం కాదు. ఆర్ఎస్ఎస్ రాజకీయ విభాగం బిజెపి. అది ఆర్ఎస్ఎస్ ఆదేశాలు అమలు చేస్తున్నది తప్ప రాజ్యాంగాన్ని అమలు చేయడం లేదు. రాష్ట్రాల అధికారాలను మోడీ ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటున్నది.

## కేంద్రం పెత్తనం కిందకు విద్య, వైద్యం

వేర్వేరు రాష్ట్రాల్లో, ప్రాంతాల్లో వేర్వేరు ఆర్థిక, సామాజిక, పరిస్థితులు ఉంటాయి. ఆ ప్రజల అవసరాన్ని బట్టి విద్యా వ్యవస్థను, సిలబస్‌ను రూపొందించుకోవాలి. విద్యా వ్యవస్థపై ఖర్చు రాష్ట్ర ప్రభుత్వాలదే. నిర్వహణ బాధ్యత కూడా వాటిదే. అందువల్లనే రాజ్యాంగ నిర్మాతలు విద్యను రాష్ట్రాల జాబితాలో పెట్టారు. ఎమర్జెన్సీ కాలంలో ఇందిరాగాంధీ 1976లో విద్యను ఉమ్మడి జాబితాలోకి మారుస్తూ రాజ్యాంగ సవరణ చేశారు. ఇపుడు మోడీ ప్రవేశపెట్టిన నూతన విద్యా విధానంలో శిశు విద్య మొదలు ఉన్నత విద్య వరకు సిలబస్ ఏమేమి ఉండాలో కేంద్రమే నిర్ణయిస్తుంది. పూర్వ ప్రాథమిక, ప్రాథమిక దశలో సహితం ఎవరు చెప్పాలో, వారి అర్హతలు, వాటి నిర్వహణ ఎలా ఉండాలో అంతా కేంద్రమే నిర్ణయిస్తుంది. అది చెప్పింది చేయడమే రాష్ట్రాలు చేయాల్సిన పని. రాష్ట్రాల హక్కును మోడీ కేంద్రం చేతుల్లోకి తీసుకున్నారు. దీన్ని మన రాష్ట్రంలో టిడిపి బలపరుస్తోంది. జగన్ మోహన్ రెడ్డి నాయకత్వలోని మన రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ఉత్సాహంగా ఆ విధానాన్ని దేశంలోనే ముందుగా అమలు చేస్తున్నది.

విద్యను ధార్మిక సంస్థలకు, ప్రైవేట్ కార్పొరేట్ సంస్థలకు ఇవ్వడంతో పాటు విదేశీ కార్పొరేట్ సంస్థలక ఇవ్వడాకి మోడీ ప్రభుత్వం నిర్ణయించింది. మన దేశంలో 100 విదేశీ యూనివర్సిటీ క్యాంపస్‌లు పెట్టేందుకు అనుమతులు ఇస్తామని విధానంలో

ప్రకటించారు. విదేశీ యూనివర్సిటీలు మన దేశ అవసరాలకు అనుగుణంగా పాఠాలు చెబుతాయా? మన దేశ ప్రజల ఆలోచనలు ప్రభావితం చేయవా? బ్రిటిష్ మెకాలే విద్యావిధానం నుండి ఇంకా బయటపడలేదు అంటున్న స్థితిలో అమెరికాతో సహా సామ్రాజ్యవాద దేశాల నుంచి ఆహ్వానించడం దేశానికి ప్రమాదం కాదా? పరిశ్రమలు, వ్యవసాయం, బ్యాంకులు, ఇన్సూరెన్స్, టెలీకమ్యూనికేషన్స్, రక్షణతో పాటు విద్యా రంగంలోకి విదేశీ కార్పొరేట్ కంపెనీలను రానిస్తే మన దేశంలో వారికి మద్దతుదారులను మన దేశంలో తయారు చేసుకోరా? ఇది దేశ భక్తా? విదేశాలకు లొంగుబాటు కాదా? మన రాజ్యాంగానికి అనుగుణంగా లౌకిక విధానం, సమాజిక న్యాయం, రిజర్వేషన్లు అనే మాటే లేకుండా మోడీ నూతన విద్యా విధానం రాజ్యాంగ లక్ష్యాలకు వ్యతిరేకంగా రూపొందించారు.

ఇండియన్ మెడికల్ కౌన్సిల్ సమన్వయాన్ని కేంద్రం చేసేది. సభ్యులంతా రాష్ట్రాలవారే ఉండేవారు. అందులో సభ్యులంతా ఆయా రాష్ట్రాల్లో వైద్య రంగంలో నిష్ణాతులైన డాక్టర్లే. ఇప్పుడు దీన్ని మోడీ ప్రభుత్వం తల్లక్రిందులు చేసింది. దీని పేరును నేషనల్ మెడికల్ కౌన్సిల్‌గా మార్చింది. దీనికి సభ్యులను మోడీ ప్రభుత్వమే నియమిస్తుంది. ఇందులో డాక్టర్లే ఉండనవసరం లేదు. ఐఎఎస్, ఐపిఎస్ అధికార్లను తమకు తాబేదార్లుగా ఉండే ఎవరినైనా సభ్యులుగా నియమించవచ్చు. 5, 6 ఏళ్లకు ఒక సారి ఈ కౌన్సిల్‌లో రాష్ట్రానికి సభ్యత్వం వస్తుంది. మోడీ ప్రభుత్వం వైద్య విద్యను ప్రయివేటుపరం చేస్తున్నది. సగం సీట్లు యాజమాన్యం కోటాగా నిర్ణయించింది. మిగిలిన 50 శాతం సీట్లలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు చేస్తారు. కానీ ఆ సీట్లలో ఎంత ఫీజు ఉండాలో యాజమాన్యమే నిర్ణయిస్తుంది. అందువల్ల ఇక పేదలు వైద్య విద్యపై ఆశలు వదులుకోవాల్సిందే. మోడీ ప్రభుత్వం ప్రజలకు వైద్యం అందించే బాధ్యతల నుండి తప్పుకుని వైద్యాన్ని కార్పొరేట్ రంగానికి మళ్లిస్తున్నది. వైద్యాన్ని ఒక భారీ వ్యాపార సర్వీసుగా పరిగణించి జాతీయ, అంతర్జాతీయ ఇన్సూరెన్స్ కంపెనీలకు దఖలు పరుస్తున్నది. ఇందువలన అమెరికాలో మాదిరి. భారతదేశంలో కూడా పేదలకు వైద్యం అందే అవకాశం లేకుండా పోతుంది.

## రాష్ట్రం హక్కులపై బిజెపితో టిడిపి, వైసిపి రాజీ

కేంద్రం ఆధిపత్యానికి వ్యతిరేకంగా రాష్ట్రాల హక్కులకై ఏర్పడ్డ పార్టీ టిడిపి. ఆ పార్టీ వ్యవస్థాపకుడు ఎన్‌టి రామారావు ఆ నాడు జ్యోతిబసు, ఫరూక్ అబ్దుల్లా, రామక్రిష్ణ హెగ్డే, తదితరులతో కలిసి రాష్ట్రాల హక్కులకై పోరాడారు. అటువంటి

చరిత్ర కలిగిన టిడిపి కాశ్మీర్‌లో 370, 35ఎ అధికరణాలను, రాష్ట్ర హోదాను రద్దు చేయడాన్ని బలపర్చిన హీనస్థితికి దిగజారింది. జగన్ మోహన్ రెడ్డి కూడా కేంద్రం పెత్తనంపై పోరాడి రాష్ట్రానికి ప్రత్యేక హోదా తెస్తానని ప్రజలకు చెప్పి ఇపుడు రాష్ట్రాల హక్కులను బిజెపి హరిస్తుంటే దాని ముందు సాగిలపడ్డం రాష్ట్రాన్ని, ప్రజలనూ మోసం చేయడమే. పాలకులు ద్రోహులుగా మారినపుడు ప్రజలే పోరాడి హక్కులు కాపాడుకోవాలి.

## మోడీ షరతులు – ప్రజలపై భారాలు

మోడీ ప్రభుత్వం నాలుగు షరతులు అమలు చేసి రాష్ట్రాలు అదనంగా 2% (ఒక్కో షరతు అములకు 0.5% చొప్పున) అప్పు చేసుకోవచ్చని ఆదేశం జారీ చేసింది. 1. విద్యుత్ సంస్కరణలు. 2. ఒకే దేశం ఒకే రేషన్ కార్డు. 3. పట్టణ/గ్రామీణ స్థానిక సంస్థలు ప్రజలపై పన్నులు పెంచడం. 4. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్. అవి అమలు జరిపితే వెంటనే ప్రజలపై కొన్ని భారాలు, రానున్న రోజుల్లో మరిన్ని తీవ్రమైన భారాలు పడతాయి.

## ఉచిత విద్యుత్‌కు గుడ్‌బై

మోడీ ప్రభుత్వం విద్యుత్ ఉత్పత్తి, సరఫరా ఖర్చుతో సమానంగా ఆదాయం రాబట్టాలని రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశం జారీ చేసింది. 20% కంటే ఎక్కువ సబ్సిడీ ఇవ్వకూడదని షరతు పెడుతున్నది. మీటర్ బిగించకుంటే తప్ప సర్వీస్ కన్నెక్షన్ ఇవ్వొద్దని చట్టం చేస్తోంది. ఉచితంగా వ్యవసాయానికి కూడా కరెంటు ఇవ్వకూరాదని ఆదేశాలు జారీ చేసింది. అంటే పంపు సెట్లకు మీటర్లు బిగించాలి. దీన్ని శిరసావహించి జగన్ ప్రభుత్వం మీటర్లు బిగించడానికి జి.ఒ. 22 జారీ చేసింది.

“మీటర్లు బిగించినా రైతుకు వచ్చే బిల్లు అంతా రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తుంది, ఇందువలన రైతుపై ఒక్క రూపాయి భారం పడదు, మీటరు బిగింపు ఖర్చు కూడా రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుంది.. నన్ను నమ్మండి” అని జగన్ మోహన్ రెడ్డి రైతులకు భరోసా ఇస్తున్నారు. ఇప్పుడు బిల్లు కడుతున్నది, రేపు బిల్లు కట్టేది రాష్ట్ర ప్రభుత్వమే. మరి ఈ డొంక తిరుగుడు ఎందుకు? రేపు ఉచిత విద్యుత్ ఎత్తేస్తే, రాష్ట్ర ప్రభుత్వం కట్టకపోతే రైతు నుండి డబ్బు రాబట్టడానికి మార్గం ఉండాలి కదా? రైతు మోటారుకు మీటరు లేకపోతే ఎలా వసూళ్లు చేయగలరు? అందుకే మీటర్లు.

జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ఉచిత విద్యుత్ 30 ఏళ్లు మాది గ్యారెంటీ అని భరోసా ఇస్తున్నది. 30 ఏళ్లు మీరే అధికారంలో ఉంటారనుకుంటున్నారా? ఇలాగే

ఊహించుకొని చంద్ర బాబు ఓటమి నుండి ఇంకా తేరుకొలేకపోతున్నారు? ప్రజాస్వామ్యం మరిచి రాజరిక వ్యవస్థ అనుకొంటున్నారా? రేపు ఇంకొకరు అధికారంలోకి వస్తే మీ హామీలు అమలు జరుపుతారా? రైతు మెడకు ఉరి తాడు బిగించి ఉంచితే రేపు ఎవరైనా తాడు లాగేసి ఉరి తీసేయవచ్చు. మోడీ వద్దంటే జగన్మోహన్‌రెడ్డి కరెంటు నగదు బదిలీ నిలిపేయడా?

## పేద, మధ్యతరగతి ప్రజలపై విద్యుత్ భారం

గృహ వినియోగదార్లు, అల్పాదాయ వర్గాలవారు కూడా ఇప్పుడు పొందుతున్న రాయితీలను కోల్పోతారు. ఈ ఏడాది ఇఆర్‌సి నిర్ధారించిన కాస్ట్ టు సర్వ్ యూనిట్‌కు రూ. 6.87. కొత్త సవరణల ప్రకారం వినియోగదారులనుండి అంత మొత్తాన్ని కొంచెం అటు ఇటుగా వసూలు చేయాలి. ప్రస్తుతం గృహ వినియోగదార్లకు 50 యూనిట్ల లోపు రూ. 1.45 మాత్రమే వసూలు చేస్తున్నారు. వారు ఇకపై దానికి నాలుగు రెట్లు చెల్లించాల్సి వస్తుంది. అలాగే దళితులు, గిరిజనులకు 200 యూనిట్ల వరకు, దోభీ ఘాట్లకు ఉచిత విద్యుత్ ఇస్తున్నారు. చేనేత కార్మికులకు, రజకులకు, క్షౌర వృత్తిదార్లకు రాయితీ విద్యుత్ అందుతోంది. కొత్త సవరణల ప్రకారం ఇలాంటి వారందరూ నష్టపోతారు.

ఇపుడు విద్యుత్ పంపిణీ (డిస్ట్రిబ్యూషన్) కూడా ప్రైవేట్ కంపెనీలకు ఇచ్చేయాలని మోడీ నిర్ణయించారు. అందుకు చట్టంలో సవరణలు చేస్తున్నారు. మోడీ కొత్త చట్టం రేపు పార్లమెంటు ఆమోదం పొంది అమలులోకి వస్తే ఇక రాష్ట్రాలకు విద్యుత్ పై ఏ హక్కూ ఉండదు. సర్వ హక్కులు కేంద్రానివే. విద్యుత్ రేట్లు నిర్ణయించే రెగ్యులేటరీ కమిషన్ కూడా కేంద్రం గుప్పిట్లోకి పోతుంది. బిల్లు కట్టడం ఆలస్యమైన రైతు కనెక్షన్ కట్ చేయొద్దని జగన్ మోహన్ రెడ్డి చెప్పినా ఎవరూ వినరు. స్మార్ట్ మీటర్ల వలన గడువులోగా డబ్బు చెల్లించక పోతే ఫోన్లు ఆగిపోయినట్లు ఆటోమేటిక్‌గా కరెంటు కట్ అవుతుంది.

విద్యుత్ డిస్కామ్‌ల ప్రైవేటీకరణపై ముసాయిదాను కేంద్ర విద్యుత్ శాఖ సెప్టెంబర్ 22న విడుదల చేసింది. విద్యుత్ డిస్కామ్‌ల ఎక్విప్‌మెంటునంతటినీ ప్రయివేటు వారికి బదలాయించాలని, నామమాత్రపు రుసుము చెల్లించి ఆ భూములను వాడుకొనే హక్కు ప్రయివేటు వారికి కల్పించాలనీ పేర్కొంది. అదే సమయంలో ప్రైవేటు కంపెనీలకు డిస్కామ్‌లను అప్పగించే నాటికి ఉన్న అప్పులన్నింటిని తీర్చే బాధ్యత మాత్రం రాష్ట్ర ప్రభుత్వాలదే. డిస్కామ్ లాభనష్టాలతో ప్రయివేటువారికి సంబంధం

లేదట! ఇప్పటి వరకూ డిస్కాముల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులను ప్రయివేటుకు బదలాయిస్తారు. ఉద్యోగుల కుదింపు తప్పదు. రెగ్యులర్ ఉద్యోగుల సంగతే అంతంత మాత్రంగా వుంటే ఇక పెద్ద సంఖ్యలో నేడున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికుల భవిష్యత్తు అగమ్య గోచరమవుతుంది.

## పట్టణ సంస్కరణల పేరుతో భారాలు

రాష్ట్రాలకు రుణపరిమితి 0.5% పెంచడానికి పట్టణ స్థానిక సంఘాలలో పన్నులు పెంచాలని, యూజర్ చార్జీలు విధించాలని ఆదాయం పెంచాలని మోడి ప్రభుత్వం షరతు విధించింది. రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి షరతులకు తలొగ్గి అమలుకు అధికారులతో కమిటీలు వేశారు. ఇప్పటివరకు ఆస్తిపన్ను (ఇంటిపన్ను) అద్దె విలువ ఆధారంగా వేసేవారు. ఇప్పుడు ఆస్తివిలువ (స్థలం విలువ, ఇంటి విలువ) ఆధారంగా ఇంటిపన్ను నిర్ణయించి కొత్త విధానాన్ని అమలులోకి తెస్తున్నారు. దీనివలన అనేకరెట్లు పన్నులు పెరుగుతాయి. ప్రతి సం॥ ఆస్తి విలువ ఆధారంగా పన్నులు పెరుగుతాయి.

మంచినీరు, డ్రైనేజి, పారిశుద్ధ్యం ఇతర సేవలకు అయ్యే ఖర్చు మొత్తం ప్రజల నుండి యూజర్ చార్జీలు, ఫీజులు రూపంలో రాబట్టాలని ప్రభుత్వాలు నిర్ణయించాయి. ఇప్పటికి అన్ని నగరాలలో చెత్తపన్ను ప్రతి కుటుంబం నుండి చెల్లించాలని నోటీసులు జారీ చేశారు. నీటి మీటర్లు పెట్టడానికి రంగం సిద్ధం చేస్తున్నారు. ప్రతి సం॥ ద్రవ్యోల్బణం, ఖర్చులు ఆధారంగా చార్జీలు పెంచే నిర్ణయాలు చేశారు. మునిసిపల్ ఎన్నికలు పూర్తవగానే ఈ చార్జీలు అన్ని అమలులోకి వస్తాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రాంట్లు కోతపెట్టి నిర్వహణ భారం మొత్తం ప్రజల నెత్తిన రుద్దుతున్నారు. కరోనా కష్టాల్లో ఉండి, ఉపాధి ఆధారం కోల్పోయిన పట్టణ ప్రజలను ఆదుకోకుండా ఈ రీతిలో భారాలు మోపడం అన్యాయం. పౌరసేవలు కుదించబడతాయి. పేదలు, వలస కూలీల కొరకు బడా కంపెనీల ద్వారా అద్దె ఇళ్లు నిర్మించి అద్దెలు వసూలు చేయాలని కొత్త విధానాన్ని ప్రవేశపెట్టింది ప్రభుత్వం. ఇప్పటికే కొన్ని కాళీగా ఉన్న ఇళ్ళను కూడా అద్దె ఇళ్ళుగా మార్చాలని ప్రతిపాధనలు ఉన్నాయి. గ్రహనిర్మాణ బాధ్యతల నుండి ప్రభుత్వాలు తప్పుకొని కార్పొరేట్ రంగానికి అప్పగించే ఈ విధానాలను తిప్పికొట్టాలి.

## గ్రామాల్లోనూ చెత్త పన్ను

గ్రామాల్లో ప్రతి ఇంటి నుండి రోజుకు రెండు రూపాయిలు చొప్పున చెత్త

పన్ను వసూలు చేసి, అందులో నుండి స్వచ్ఛ భారత్ గ్రీన్ ఎంబాసిడర్లకు, గ్రీన్ గార్డులకు జీతాలు చెల్లించాలని జగన్ ఆదేశాలు జారీచేశారు. కొన్ని గ్రామాల్లో వసూళ్లు కూడా మొదలు పెట్టారు. స్వచ్ఛ భారత్ స్కీం మోడీది. మీరే జీతాలు ఇవ్వండి అని అడగాల్సిన జగన్ మోహన్ రెడ్డి ఆ పనిచేయకపోగా జనంపై పడి ఇంటికి రోజుకు రెండు రూపాయల చొప్పున, నెలలకు రూ. అరవై, సంవత్సరానికి రూ.720/- చొప్పున పన్ను భారం వడ్డించడం అన్యాయం. మోడీ దగ్గర మీ మెప్పు కోసం మేము పన్ను కట్టాలా? కట్టబోము అని ప్రజలు ఎదురు తిరగాలి.

## రేషన్ కార్డుకు ప్రమాదం

ఒకే దేశం ఒకే రేషన్ కార్డు విధానం అమలు చేయాలని కేంద్రం ఆదేశిస్తున్నది. దేశ ఆహార భద్రత చట్టం (ఎన్ఎఫ్ఎస్ఎ) అర్హతల ప్రకారం కార్డులు ఉండాలి తప్ప అంతకు మించి ఉండరాదని షరతు విధించింది. దీన్ని అమలు చేసేందుకు జగన్ ప్రభుత్వం సిద్ధమవుతున్నది. కేంద్రం అర్హతలను బట్టి మన రాష్ట్రంలో ఎన్ఎఫ్ఎస్ఎ కార్డులు దాదాపు 89 లక్షలు ఉన్నాయి. మన రాష్ట్ర ప్రభుత్వం విధించిన ఆర్థిక పరిధిని బట్టి మరో 63 లక్షలు రేషన్ కార్డులు ఉన్నాయి. మోడీ చెప్పినట్లు చేస్తే చాలా మంది కార్డులు భవిష్యత్తులో ఎగిరి పోతాయి.

## అమెరికా ఉచ్చులో మోడీ ప్రభుత్వం

మోడీ నాయకత్వంలో ఏర్పడిన బిజెపి ప్రభుత్వం స్వాతంత్ర్యోద్యమ కాలం నాటినుండి భారతదేశం అనుసరిస్తున్న సామ్రాజ్యవ్యతిరేక వైఖరిని తుంగలోతొక్కి అమెరికన్ సామ్రాజ్యవాదానికి మోకరిల్లుతున్నది. మన దేశ సార్వభౌమాధికారాన్ని, వ్యూహాత్మక స్వతంత్రతను తుంగలో తొక్కింది. దీనితో భారతదేశం అమెరికా జూనియర్ భాగస్వామిగా దృఢపడింది. ఈ ఒప్పందం ప్రకారం ప్రపంచలో ఏ దేశం మీద అమెరికా యుద్ధం చేసినా మన దేశంలో ఆయిల్ నింపుకునేందుకు అమెరికా యుద్ధ విమానాలకు అనుమతించాలి.

"2020 నాటికి చైనాను సైనికంగా ఎదుర్కొనేందుకు అమెరికాకు సహకరించే ఓ మిత్రుడు కావాలి. చైనాకు వ్యతిరేకంగా భారతదేశాన్ని తయారుచేసే అవకాశాన్ని జారవిడుచుకోలేమని", అమెరికా ప్రకటించింది. అమెరికా లక్ష్యాల్లో ఇదొకటి. బిజెపి వైఖరి వలన రక్షణ రంగంలో వ్యూహాత్మక భాగస్వామ్యం అక్కడికే పరిమితంగాక భారత్ – అమెరికా అణు విద్యుత్ ఒప్పందం ద్వారా అమెరికా కార్పొరేట్ల లూటీకి ద్వారాలు తెరిచింది. ఈ ఒప్పందం ముసుగులో మన డబ్బును వెస్టింగ్ హౌజ్‌లాంటి

దివాలా సంస్థలను రక్షించేందుకు ఉపయోగిస్తున్నది. శ్రీకాకుళం జిల్లా కొవ్వాడలో పెట్టబోయే ఆరు న్యూక్లియర్ రియాక్టర్ల వెనుక భారీ అవినీతి దాగి వుంది.

## దళితులపై పెరిగిన దాడులు

బిజెపి అధికారంలోకి వచ్చాక దళితుల పరిస్థితి పెనం మీద నుండి పొయ్యిలో పడినట్లయింది. దళితులపై దాడులు, దౌర్జన్యాలు, హత్యలు పెరిగాయి. వివక్షకూ, అణచివేతకు గురైన ఎస్సీ, ఎస్టీ సామాజిక తరగతులకు భారత రాజ్యాంగం అనేక రక్షణలు కల్పించింది. రాజకీయ, విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు ఆ రక్షణల్లో భాగమే. మోడి నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం ఆర్.ఎస్.ఎస్ దాని అనుబంధ సంస్థలతో ఈ రక్షణలపై బహిరంగ దాడులు చేయిస్తున్నది. బిజెపి పాలిత రాష్ట్రాల్లో దాడులు, దౌర్జన్యాలు పెరుగుతున్నాయి. మనుధర్మశాస్త్రం ప్రకారం కుల వ్యవస్థను నేరుగా బలపరుస్తున్నారు. ఇస్లాం పరిపాలకుల వలనే భారతదేశంలో దళిత కులాలు ఏర్పడ్డాయని హిందూ మతశక్తులు ప్రచారం చేస్తున్నాయి.

జాదవ్ కమిటీ సిఫార్సుల ప్రకారం ప్లాన్ బడ్జెట్‌లో ఎస్‌సి స్పెషల్ కాంపోనెంట్ ప్లాన్ కనీసం 4.63%, ఎస్.టి.కాంపోనెంట్ ప్లాన్‌కి కనీసం 2.39% కేటాయించాలి. నరేంద్ర మోడీ ప్రభుత్వం 2017-18లో ఎస్‌సిఎస్‌పికి 2.50 శాతం, ఎస్‌టిపికి 1.53 శాతం కేటాయించింది. 2015-16, 2016-17లో మరీ తక్కువ కేటాయించింది. సివిల్ సర్వీస్ పరీక్ష అర్హత వయస్సును 35 నుంచి 29 ఏళ్లకు తగ్గించింది. ప్రభుత్వ సర్వీసులను ప్రైవేటు పరం చేయడంతో రిజర్వేషన్లను లేకుండా చేస్తున్నది.

జాతీయ మానవహక్కుల కమిషన్ నివేదిక ప్రకారం ప్రతి 18 నిమిషాలకు ఒక దళితునిపై దాడి జరుగుతున్నది. సరాసరి ప్రతిరోజూ ముగ్గురు దళిత మహిళలు అత్యాచారానికి గురవుతున్నారు. ప్రతిరోజూ ఇద్దరు దళితులు హత్య చేయబడుతున్నారు. ఎన్‌సిఆర్‌బి క్రైం నివేదిక ప్రకారం 2012లో 33,655మంది దళితులపై దాడి జరగ్గా 2015కి 45,003 మందికి పెరిగింది. అగ్రకుల పెత్తందార్ల దౌర్జన్యాలకు బిజెపి ప్రభుత్వాల మద్దతుతో కులతత్వ శక్తులు బరితెగించి దళితులపై దాడులు చేస్తున్నాయి.

బిజెపి పాలిత రాష్ట్రాల్లో దళితులపై దాడులు భారీగా పెరిగాయి. దళితులపై దాడుల్లో 163 శాతం పెరుగుదలతో గుజరాత్ అగ్రస్థానంలో వుండగా, తరువాత స్థానాల్లో ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, బీహార్‌తోపాటు ఆంధ్రప్రదేశ్ వుంది.

ఆర్.ఎస్.ఎస్ అనుబంధ సంఘాలు గోరక్షక దళం పేరుతో దళితులు, ముస్లింలపై తీవ్ర దాడులు చేస్తున్నాయి.

## ఆదివాసీలపై దాడి

ఆదివాసీలకు చారిత్రకంగా జరిగిన అన్యాయాన్ని సరిదిద్దుతున్నట్లు 2006 అటవీ హక్కుల చట్టం భాష్యం చెప్పింది. నాటి రాజులు, అనంతరం బ్రిటిష్ పాలకులు, స్వాతంత్ర్య అనంతరం ఏర్పడిన ప్రభుత్వాలు అడవి మీద ఆధారపడి జీవిస్తున్న ఆదివాసీలను దురాక్రమణదారులుగానే పరిగణించాయి.

దేశ విదేశీ బహుళ జాతి కంపెనీలకు అడవుల్లో నిక్షిప్తమైన ఖనిజ సంపదను, వనరులను కొల్లగొట్టడానికి 2006 అటవీ హక్కుల చట్టం అవరోధంగా మారుతుందని తెలుసు. ఆదివాసీలు తాము బ్రతుకుతున్న భూమిని, కొండలను త్రవ్వేస్తే తాము ఎలా బ్రతకాలని ఎదురు తిరుగుతారు. అలా ఎదురు తిరిగినందునే చంద్రబాబు, రాజశేఖర రెడ్డి, మన్మోహన్ సింగ్, మోడీ అందరూ విశాఖ మన్యాన్ని కార్పొరేట్లకు అప్పజెప్ప లేకపోయారు.

ఆదివాసీలను చీల్చి దెబ్బదీసేందుకు ఆదివాసీల్లో బ్రోకర్లను సృష్టించినా బాక్సైట్ త్రవ్వకాలు సాధ్యం కాలేదు. ఇలాంటి ఎన్నో అనుభవాల నేపధ్యంలో అడవిపై ఆధారపడి జీవిస్తున్న ఆదివాసీలను భూమి నుండి వేరు చేసి అడవి నుండి తరిమేస్తేనే ఖనిజ సంపద కొల్లగొట్టేందుకు ఎదురుండదని కార్పొరేట్ శక్తులు ప్రభుత్వాలతో ఆ దిశగా నిర్ణయాలు చేయిస్తున్నాయి.

గత ఆరేళ్ళలో మోడీ ప్రభుత్వం 5 లక్షల ఎకరాల అటవీ భూమిని కార్పొరేట్ కంపెనీలకు ఇచ్చేసింది. 5వ షెడ్యూల్డ్ ఏరియాలో రాజ్యాంగం, పీసా చట్టం భూమికి సంపూర్ణ రక్షణ కల్పించినప్పటికీ మోడీ వాటిని ఉల్లంఘించి కార్పొరేట్లకు ఇచ్చేశారు. పోలవరం ప్రాజెక్టులో 50 వేల ఎకరాల అటవీ భూమి మునిగిపోతుంది. రాజధాని నిర్మాణానికి 50 వేల ఎకరాల అటవీ భూమి కావాలని చంద్రబాబు అడగడం, కేంద్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకరించడం అందరికీ తెలిసిందే.

## పర్యావరణ అనుమతులు అవసరం లేదట

భూ సేకరణ, మైనింగ్‌కు పర్యావరణ అనుమతులు ఆటంకాలు కాకుండా మోడీ ప్రభుత్వం పర్యావరణ నిబంధనలు కూడా తొలగించే సవరణలు చేసేసింది. ఇక గిరిజనులను తరిమేసి మైనింగ్ ఏరియాలో విదేశీ కంపెనీలు యధేచ్ఛగా గనులు త్రవ్వుకుని దోచుకోవడమే ఆలస్యం. మన గిరిజనులు ఎక్కడ బ్రతకాలి? ఎలా బ్రతకాలి?

ఈ ప్రశ్నలకు మోడీ ప్రభుత్వం వద్ద ఎటువంటి సమాధానం లేదు. భాధ్యత కూడా లేదు. లాక్ డౌన్ సమయంలో వలస కార్మికుల పట్ల మోడీ ప్రభుత్వం చూపిన కిరాతకం అందరికీ గుర్తుంది కదా? నిర్వాసిత గిరిజనుల పట్ల ఇంతకంటే భిన్నంగా ఉండదు.

## అంతా ప్రయివేటు పరమే – రిజర్వేషన్లు ఎక్కడ?

1990 తరువాత ప్రయివేటీకరణ సిద్ధాంతంతో బిజెపి, టిడిపి, కాంగ్రెస్, ఇతర ప్రాంతీయ పార్టీలు విద్య, వైద్యంతో సహా ప్రభుత్వ సర్వీసులన్నిటినీ ప్రయివేటుపరం చేస్తున్నాయి. వామపక్షాలు మాత్రమే అందుకు మినహాయింపు ప్రయివేటు సంస్థల్లో రిజర్వేషన్లు లేవు. అందువలన రిజర్వేషన్ ప్రాతిపదికన నియామకాలు లేవు. ఆ ప్రయివేటు సంస్థల్లో గిరిజనులను, దళితులను తీసుకోవడం లేదు. ఉదాహరణకు ఆర్టిసిని తీసుకోండి. అద్దె బస్సు డ్రైవర్, మెయింటనెన్సు వంటి పనులు చేసే సిబ్బందిని బస్సు యజమాన్యమే నియమిస్తుంది. మరి రిజర్వేషన్ ఉన్నట్లా? లేనట్లా? ఆ విధంగా రిజర్వేషన్లపై ప్రభుత్వాలు వేటు వేస్తున్నాయి. రిజర్వేషన్ కాగితాలకే పరిమితం తప్ప ఆచరణ నుండి నిష్క్రమింపజేస్తున్నారు.

## పౌరహక్కులపై దాడి

జమ్మూ కాశ్మీర్‌లో ఏమి జరుగుతుందో దేశమంతా తెలియకుండా, చివరికి ఆ రాష్ట్ర ప్రజలకూ తెలియకుండా ఇంటర్నెట్ ఆపేశారు. టెలివిజన్ ప్రసారాలు నిలిపివేశారు. 144 సెక్షన్ విధించి ప్రజల కదలికను కట్టడి చేశారు. జమ్మూ కాశ్మీర్‌లో రాజకీయ పార్టీల నాయకులను నిర్బంధంలోకి పెట్టారు. జమ్మూ కాశ్మీర్‌ను ఉద్ధరించడానికైతే ఇంత నిర్బంధం ఎందుకు విధిస్తున్నారని ప్రజల ఇంగితం ప్రశ్నిస్తున్నది. రాష్ట్రానికి ప్రత్యేకహోదా అడుగుతున్న టిడిపి, వైసిపిలు మోడీని ప్రశ్నించకపోగా రాజ్యాంగ విరుద్ధం, ఫెడరల్ వ్యవస్థను దెబ్బదీసి, ప్రజాస్వామ్యాన్ని తుంగలో తొక్కి నిరంకుశంగా జమ్మూ కాశ్మీర్‌ను ధ్వంసం చేసే మోడీ ప్రభుత్వానికి మద్దతివ్వడం మన రాష్ట్రానికి నష్టమే.

## చట్ట విరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్ట సవరణ

ఏ రాష్ట్రంలోనైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు అనుమానితుల ఆస్తులు స్వాధీనం చేసుకునేందుకు ఈ చట్ట సవరణతో జాతీయ దర్యాప్తు సంస్థకు అధికారం ఇవ్వబడుతుంది. ఇంత వరకు రాష్ట్ర పోలీసు అనుమతితోనే ఇది జరిగేది. ఈ సంవరణతో రాష్ట్ర పోలీసు అనుమతి అవసరం లేదు. అసలు

చెప్పనవసరం లేదు. రాష్ట్ర ప్రభుత్వం అనుమతి లేకుండా కేంద్రం చొరబడిపోవడమే. ఇది రాష్ట్రం హక్కును కేంద్రం స్వాధీనం చేసుకోవడమే.

ఈ చట్ట సవరణ ప్రకారం ఏ వ్యక్తినైనా టెర్రరిస్టుగా ప్రకటించవచ్చు. కోర్టు ముందు హాజరు పర్చకుండా రెండు సంవత్సరాలు జాతీయ నేరపరిశోధనా సంస్థ నిర్బంధించవచ్చు. టెర్రరిజాన్ని, విప్లవ సిద్ధాంతాన్ని ప్రోత్సహిస్తున్నారనే నెపంతో టెర్రరిస్టుగా, అర్బన్ నక్సలైట్‌గా ప్రకటిస్తామని అమిత్‌షా పార్లమెంటులో ప్రకటించియున్నారు. ఇది భారత రాజ్యాంగం పౌరులకు ఇచ్చిన ప్రాథమిక హక్కులను హరించివేయడమే. బిజెపి ప్రభుత్వం పట్ల వ్యతిరేకత వ్యక్తం చేసిన వారినందరినీ భయపెట్టి లొంగదీసుకోవడానికి లేదంటే టెర్రరిస్టు ముద్ర వేసి జైళ్ళలో నిర్బంధించే కుట్రే ఈ సవరణకు మూలం.

## సమాచార హక్కు చట్టం (సవరణ) బిల్లు

ఈ సవరణతో కేంద్ర సమాచార కమీషన్ చీఫ్, ఇతర కమీషనర్లతోపాటు రాష్ట్రస్థాయి కమీషనర్ల పదవీకాలం, వేతనాలు, ఇతర విధి విధానాలకు సంబంధించిన నియమ నిబంధనలు రూపొందించే అధికారం కేంద్రానికి దఖలు పడుతుంది. దీంతో సమాచార కమీషనర్లకు ఎటువంటి స్వతంత్రత ఉండదు. కేంద్ర ప్రభుత్వం ముందు చేతులు కట్టుకు నిల్చోవడమే. సమాచార హక్కు చట్టం శిరచ్ఛేదం చేసేసింది. సమాచారం పొందే పౌరుల హక్కును మోడీ ప్రభుత్వం లాగేసుకుంది. ఇదీ రాష్ట్రాల హక్కులు కాలరాయడమే.

## వినియోగదార్ల హక్కుల పరిరక్షణ చట్టం (సవరణ)

కేంద్ర వినియోగదారుల రక్షణ వ్యవస్థను ఏర్పాటు చేస్తారు. వినియోగదార్ల హక్కుల పరిరక్షణ, శిక్షలు, పెనాల్టీలు విధింపులో కేంద్ర వ్యవస్థదే తుది నిర్ణయం. ఈ చట్ట సవరణ ద్వారా రాష్ట్రాలకు ఇప్పటి వరకు ఉన్న హక్కులు ఇక ముందు ఉండవు. వినియోగదార్ల హక్కు గల్లంతే. రాష్ట్ర స్థాయి వినియోగదార్ల ఫోరం నిర్వహణ రూపంలో అదనపు ఆర్థిక భారం రాష్ట్రాలపై పడుతుంది.

## జాతీయ దురహంకారం ప్రమాదకరం

హిట్లర్ జర్మన్లు గొప్ప జాతి అని, ప్రపంచాన్ని పాలించే అర్హతగల జాతి అని, జర్మన్లకు జాతీయ ఉన్మాదం ఎక్కించాడు. ఆ ఉన్మాదంతో హిట్లర్ ఫాసిస్టు చర్యలన్నింటినీ, అవి ఎంత కిరాతకమైనవైనా జర్మన్లు బలపర్చారు. వేలకు వేల యూదులను

హత్యగావిస్తుంటే జర్మన్ల ఉన్నత భవిష్యత్ కోసమే చేస్తున్నట్లు భావించి హిట్లర్ హంతక చర్యలను జర్మన్లు బలపర్చారు. ప్రపంచాధిపత్యం కోసం హిట్లర్ రెండో ప్రపంచయుద్ధాన్ని జర్మన్లు బలపర్చారు. చివరికి రష్యన్ రెడ్ ఆర్మీ దెబ్బకు హిట్లర్ అవమానకంగా ఆత్మహత్య చేసుకోగా ఫాసిస్టు హిట్లర్ జాతీయ ఉన్మాదానికి గురైన జర్మన్లు దారుణంగా నష్టపోయారు. హిట్లర్ యుద్ధోన్మాదం 3 కోట్ల ప్రజల మరణానికి, 6 కోట్ల ప్రజలు క్షతగ్రాతులు కావడానికి కారణమయ్యింది. ఇంత క్రూరమైన చర్య చరిత్రలో ఎన్నడూ నమోదు కాలేదు. జాతీయో న్మాదానికి, మతోన్మాదం తోడైతే అంతటి క్రూరత్వమే జనిస్తుంది.

## లౌకిక విధానానికి విఘాతం

నేషనల్ రిజిష్టర్ ఆఫ్ సిటిజన్ (ఎన్ఆర్సి) పేరుతో ముస్లింలను మాత్రమే దేశం నుండి తరిమేస్తామని స్వయంగా హోంమంత్రి ప్రకటించారు. కేవలం అస్సాంకే పరిమితమైన ఎన్.ఆర్.సి.ని దేశవ్యాపితం చేస్తామని ప్రకటించారు. విదేశీయులైన హిందువులు, క్రైస్తవులు, బౌద్ధులు, జైనులను దేశ పౌరులుగా గుర్తిస్తామని ప్రకటించారు. మతం ఆధారంగా ప్రజలను విభజించి కొన్ని మతాల వారికి హక్కులు లేకుండా చేయడం మన రాజ్యాంగ సూత్రాలను ఉల్లంఘించడమే. జర్మనీ వలనే ఒకరి తరువాత ఒకరిని అందరినీ అంతం చేయడం దాని లక్ష్యం.

## మోసం వాళ్ల నైజం

నోరు విప్పితే అబద్దాలే తప్ప నిజం అన్నదే రావడం లేదు ఈ మూకలకు. మహాత్ముడు "ఈశ్వర్ అల్లా తేరే నామ్" అని జీవితాంతం ఘోషించాడు. "మత ఘర్షణ వద్దు. హిందూ ముస్లిం భాయీ భాయీ" అన్నాడు. ఈ నేరానికి ఆర్ఎస్ఎస్ పథకం ప్రకారం మహాత్మున్ని నాథూరాం గాడ్సేతో హత్య చేయించింది. నాథూరాం గాడ్సేకు గుడి కడతామని ఒకవైపు ప్రకటిస్తూ గాంధీజీ పట్ల ఎనలేని ప్రేమ ఒలకబోస్తున్నది బిజెపి. ఇది పచ్చి మోసం. కాశ్మీర్ విషయంలో చెప్పిన అబద్ధం చెప్పకుండా అబద్ధాల హోరులో దేశ ప్రజల చేత అబద్దాన్నే నిజం అని నమ్మించింది. ఆర్ఎస్ఎస్ బిజెపి మూకలు దళితులను హిందువులు, దళిత క్రిష్టియన్ల క్రింద విభజించి దళిత క్రిష్టియన్లకు రిజర్వేషన్లు ఇవ్వరాదని వివాదం సృష్టిస్తున్నది.

## అమెరికాకు లొంగుబాటు

హైడ్రాక్సీ క్లోరోక్విన్ మందు పంపకపోతే ట్రంప్ ప్రతీకారం తీర్చుకుంటామంటే

మోడీ ప్రభుత్వం భయపడిపోయింది. మారుమాటాడకుండా అమెరికాకు మందును పంపించేసింది. చైనా నుండి తమిళనాడుకు రావాల్సిన రాపిడ్ టెస్టింగ్ కిట్ల అమెరికా బలవంతంగా మళ్ళించేసుకున్నా మోడీ ప్రభుత్వం నోరుమెదపలేదు. ఇరాన్ నుండి ఆయిల్ కొనవద్దని అమెరికా ఆజ్ఞ జారీ చేయగానే ఇరాన్ నుండి ఆయిల్ కొనడం ఆపివేసింది.

సార్వభౌమాధికారంగల ఏ దేశ ప్రభుత్వమైనా ఇంత అవమానకరంగా వ్యవహరిస్తుందా? నిత్యం దేశభక్తి, భారతదేశ గత ఔన్నత్యం గురించి గొప్పగా చెప్పే మోడీ ప్రభుత్వం ఇంతలా సాగిల పడిపోవడాన్ని ఏమనుకోవాలి? స్వాతంత్ర్య పోరాట కాలంలోనేగాక నేటికీ ఈ ఆర్ఎస్ఎస్ విభాగానికి సామ్రాజ్యవాద లొంగుబాటు కొనసాగుతున్నదని అనుకోవచ్చా?

## కొంతకాలంగా సుప్రీంకోర్టు తీర్పులు

ఒక పిటీషన్‌ను అవకాశంగా తీసుకొని సుప్రీం కోర్టు అటవీ హక్కుల చట్ట ప్రకారం పట్టాలు లేనివారిని భూమినుండి తొలగించాలని, అడవి నుండి బయటకు నెట్టేయాలని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు డైరెక్షన్ ఇచ్చింది. అదే అమలైతే లక్షల సంఖ్యలో గిరిజనులకు వారి భూమి నుండి, జీవన భృతి నుండి, తమ అడవితల్లి నుండి దూరం అయ్యే ప్రమాదం దాపురిస్తుంది. దేశవ్యాపితంగా గిరిజనులు, ప్రజాతంత్ర వాదులు, తీవ్రమైన ఆందోళనకు దిగడంతో రాబోయే ఎన్నికల్లో రాజకీయ అవసరాన్ని దృష్టిలో పెట్టుకుని మోడీ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్ళి గిరిజనులను తొలగించవద్దని అర్జీ పెట్టుకుంది. ఇంకా తుది తీర్పు రావాల్సి వుంది. ఇందులో సుప్రీంకోర్టు, మోడీ ప్రభుత్వాల వైఖర్లు గిరిజనులకు సానుకూలంగా కానరావడం లేదు.

## సుప్రీం కోర్టు తీర్పు గిరిజనులపై పిడుగుపాటే

రాజ్యాంగంలో 5వ షెడ్యూల్‌లో గవర్నర్‌కు గల ప్రత్యేక అధికారాన్ని ఉపయోగించి షెడ్యూల్ ప్రాంతంలో ఉపాధ్యాయుల నియామకంలో 100% రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జి.వో.3 ఇవ్వడం జరిగింది. సుప్రీం కోర్టు ధర్మాసనం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అమలులో వున్న జి.వో.3ని రద్దు చేస్తూ తీర్పునిచ్చింది. రిజర్వేషన్లు 50% మించకూడదని, 100% రిజర్వేషన్ ఇచ్చినందున జి.వో.ను రద్దు చేస్తూ తీర్పునిచ్చింది. అక్కడితో ఆగకుండా రిజర్వేషన్లు 10 ఏళ్ళవరకే రాజ్యాంగం కల్పించగా రాజకీయ అవసరాల కోసం పొడిగించుకుంటూ వస్తున్నారు తప్ప ధైర్యంచేసి రిజర్వేషన్లు సమీక్ష చేయడం లేదని కూడా సుప్రీం కోర్టు న్యాయమూర్తులు

వ్యాఖ్యానించారు. ఆర్ఎస్ఎస్ ఛీఫ్ భగవత్ "రిజర్వేషన్లు సమీక్ష చేయాలని" చేసిన వ్యాఖ్యానానికి ఇది బలం చేకూరుస్తున్నది.

## ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం నిర్వీర్యం

వందల సంవత్సరాలు కుల విభజనతో దళితులు, గిరిజనులు, నిమ్నకులాలు దారుణ హింసకు, అణచివేతకు గురయ్యారు. అగ్రకుల దురహంకారులు నేటికీ వారిని మనుషులుగా చూడడం లేదు. ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా అణచివేతకు గురయ్యే ఈ ప్రజలపై జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలు, హత్యలు, మానభంగాలకు అంతే లేదు. వాటి నుండి రక్షణకై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం తేబడింది. ఆ చట్టం దుర్వినియోగం అవుతున్నదనే నెపంతో చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ సుప్రీం కోర్టు ఈ కాలంలోనే తీర్పు ఇచ్చింది. దేశమంతా దళితులు, గిరిజనులూ, ప్రజాతంత్ర వాదులు ఒక్క పెట్టున కదిలి పోరాడారు. ఆ పోరాటంలో 12 మంది బలయ్యారు. ఆ తరువాత సుప్రీం కోర్టు తను ఇచ్చిన తీర్పును దిద్దుకున్నది. ప్రమోషన్లలో రిజర్వేషన్లు కూడా రాజ్యాంగ విరుద్ధమనే తీర్పు కూడా సుప్రీంకోర్టు ఈ కాలంలోనే ఇచ్చింది. దళితులకూ, గిరిజనులకూ, బలహీన సామాజిక తరగతులకు రక్షణగా నిలుస్తున్న పౌర హక్కుల కార్యకర్తలను జైళ్ళలోకుక్కేందుకు మోడీ ప్రభుత్వం ఉపా చట్టాన్ని చేసింది. ఆ చట్టాన్ని అతి క్రూరంగా అమలు జరుపుతోంది. మోడీ ప్రభుత్వం పౌరహక్కుల ఉల్లంఘనను అణచివేతను సుప్రీం కోర్టు అడ్డుకోవడం లేదు. రాజ్యాంగపరంగా పౌర హక్కులను రక్షించాల్సిన సుప్రీం కోర్టు బాధ్యతను నిర్వహించడం లేదని సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తులు, న్యాయమూర్తులే విమర్శిస్తున్నారు.

## కాశ్మీర్ 370, 35ఎ ఆర్టికల్స్ రద్దుపై

బిజెపి దేశంలో ఏ రాష్ట్రానికీ లేని ప్రత్యేకత కాశ్మీర్‌కు ఎందుకు ఉండాలి? అనే వైఖరి కలిగి వుంది. కాశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తి కారణంగా ఉగ్రవాదం పెరుగుతోందని, సంవత్సరాల తరబడి తన ఆర్ఎస్ఎస్ అనుబంధ సంఘాల ద్వారా, తన అనుకూల మీడియా ద్వారా ప్రచారం చేసింది. దేశ ప్రజలను నమ్మించింది. చివరికి కాశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తినిచ్చే 370 అధికరణాన్ని రద్దు చేసింది. కాశ్మీర్ ప్రజలకు మాత్రమే భూమిపై హక్కు దఖలు పర్చే 35ఎ అధికరణాన్ని రద్దు చేసింది అందుకు కాశ్మీర్ మొత్తాన్ని జైలుగా మార్చింది. అన్ని రాజకీయ పార్టీల నాయకులను, మాజీ ముఖ్యమంత్రులను, ప్రస్తుత పార్లమెంటు సభ్యులను ఖైదు చేసింది. రాజ్యాంగం కల్పించే అన్ని పౌరహక్కులూ నిరాకరించింది. మందబలంతో రాజ్యాంగాన్ని ఖూనీ చేసింది.

దీనిపై సుప్రీం కోర్టులో పిటిషన్లు వేయగా సుప్రీం కోర్టులో విచారణ చేయకుండా వాయిదా వేసింది.

## మోడీ ప్రభుత్వాన్ని ప్రజలు ఎలా విశ్వసించాలి ?

కరోనా మొదట2019 డిసెంబర్ 30న చైనాలో బయట పడింది. మన దేశంలో మొదటి కేసు జనవరి 30న కేరళలో నమోదయ్యింది. మోడీ ప్రభుత్వం పట్టించుకోలేదు. 'నమస్తే ట్రంప్ పేరిట' హంగామా చేసింది. మధ్యప్రదేశ్‌లో ప్రజలెన్నుకున్న ప్రభుత్వాన్ని కూల్చి, బిజెపి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంపైన దృష్టి పెట్టింది. రెండు నెలలు వృధా చేసి మార్చి 25 నుండి మోడీ హఠాత్తుగా 4 గంటల వ్యవధిలో లాక్‌డౌన్ విధించేశారు. అమెరికా తరువాత మన దేశమే కరోనా కేసుల్లో రెండో స్థానంలో వున్నా కరోనాను నిరోధించడంలో మనమే బెస్ట్ అనే మోడీని ఎలా నమ్మాలి.

## పెద్దనోట్లు రద్దులోను ఇలాగే జరిగింది

పెద్ద నోట్లరద్దుతో ఉగ్రవాదం, అవినీతి, నల్లధనం, నకిలినోట్లు అంతమని మోడీ చెప్పారు. "50 రోజులు నాకు సమయం ఇవ్వండి, చెప్పింది జరగకపోతే నన్ను ఉరి తీయండి" అన్నారు. ఉగ్రవాదంపెరిగింది. నల్లధనం తెల్ల ధనమయ్యింది. అవినీతి అంతం కాలేదు. అవినీతిపరులు అంతా బిజెపిలో చేరుతున్నారు. మోడీ ప్రభుత్వమే అవినీతిపరులను విదేశాలకు పంపించేసి రక్షిస్తోంది. నకిలీ నోట్లు ఏటీఎం ద్వారానే విరివిగా సరఫరా అవుతున్నాయి. మోడీ ప్రభుత్వాన్ని ఎలా ప్రజలు నమ్మాలి?

## 370 రద్దు చేసినా ఉగ్రవాదం తగ్గలేదు

కాశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తే దేశంలో ఉగ్రవాదానికి మూలమని దశాబ్దాల పాటు ప్రచారం చేసి చేసి దేశ ప్రజలను నమ్మించి 2019 ఆగస్ట్ 5న 370 ఆర్టికల్ రద్దు చేశారు. 2018లో 328 ఉగ్రవాద ఘటనలు జరిగాయి. 370ఆర్టికల్ రద్దు చేసిన ఈ ఏడాదిలో 3168 ఘటనలు జరిగాయి. దాదాపు 10 రెట్లు పెరిగాయి. 2019 ఆగస్ట్ 5 కు పూర్వం 55% స్థానిక కాశ్మీరీ ప్రజలు ఉగ్రవాద కార్యకలాపాల్లో భాగస్వాములవగా ఈ సంవత్సరకాలంలో ఉగ్రవాద కార్యలాపాలాల్లో స్థానిక కాశ్మీరీ ప్రజలు 79% మంది భాగస్వాములయ్యారు. మోడీ, షా పార్లమెంటుకు చెప్పింది నిజం కాలేదు. కాశ్మీర్ లో ఉగ్రవాదం అంతం కాలేదు. తగ్గలేదు. పైగా పెరిగింది. దశాబ్దాలు పాటు చేసిన ప్రచారమూ, మోడీ దేశానికి చెప్పింది అబద్దమని నిర్ధారణ అయ్యింది.

మతోన్మాదం తలకెక్కినపుడు అది ఉన్మాదంగా అవతరించి విధ్వంసం సృష్టిస్తుంది. ఉగ్రవాదానికి మత బేధం ఉండదు. తనకు భిన్న భావన గల తన మతం వారినీ వదిలి పెట్టదు. మహాత్ముని హత్య చేసిన గాడ్సే హిందువే. గాంధీ కంటే హిందూ మత విశ్వాసం గల వారు ఎంత మంది వుంటారు? పాకిస్తాన్‌లో స్కూల్ పిల్లలను 150 మందిని పొట్టన పెట్టుకున్నది ఇస్లామిక్ ఉగ్రవాదమే. ఇందులో పరమత ద్వేషం ఏముంది? మతోన్మాదం తన ఉన్మాదానికి మతమేదైనా మానవత్వాన్ని బలి చేస్తుంది.

## కార్మిక హక్కులు హరింపు

మోడీ ప్రభుత్వం 150 ఏళ్లుగా పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను హరిస్తున్నది. భారత దేశంలో కార్మికులను స్వేచ్ఛగా దోచుకునేందుకు కార్మిక చట్టాలు అడ్డువస్తున్నాయని కార్పొరేట్లు ఏనాటి నుంచో ఫిర్యాదు చేస్తున్నాయి. మోడీ ప్రభుత్వం కార్పొరేట్ల కోర్కెలు అనుకూలంగా 150 ఏళ్ల నుండి పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను తొలగించింది. కార్మిక చట్టాల్లో కార్మికులకు మేలుచేసే అంశాలను తొలగించేసింది. ఇండస్ట్రియల్ డిస్పూట్ యాక్ట్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పిస్తున్నది. మోడీ ప్రభుత్వం దాన్ని లేపేసింది. ఫిక్స్‌డ్ టర్మ్ జాబ్ ను తెచ్చింది. అనగా ఎన్ని రోజులు,ఎన్ని గంటలు పని కావాలో అంతవరకే కార్మికులను పెట్టుకొనే సౌలభ్యం యజమానులకు కల్పించింది. రాబోయే కాలంలో రెగ్యులర్, పర్మనెంట్ అంటూ ఉండదు.

నేడు ఎనిమిది గంటల పని దినం చట్టబద్దం. వారానికి 48 గంటలు. అంతకు మించి చేయించుకుంటే అదనపు వేతనం ఇవ్వాలి. మోడీ దాన్ని రోజుకు 12 గంటలు చేశారు. వారానికి 72 గంటలు చేయించు కోవచ్చు. అదనపు వేతనం ఇవ్వాల్సిన పని లేదు. ఇపుడు 20 మంది పని చేసే సంస్థను మూసేయాలంటే ప్రభుత్వ అనుమతి కావాలి. మోడీ 300 మందివరకు పని చేసే సంస్థలను మూసివేసివేయడానికి ప్రభుత్వ అనుమతి అవసరం లేకుండా సవరణ చేశారు. కార్మికులను కట్టుబానిసలుగా వాడుకునే విధంగా కార్మిక చట్టాలను కోడ్‌లుగా మార్చేశారు.

## మానవహక్కుల ఉల్లంఘన

దేశంలో బిజెపి పాలనలో మానవ హక్కులు రోజురోజుకు దిగజారుతున్నాయి. 180 దేశాల్లో మనది 142వ స్థానం. పౌరసత్వ చట్ట సవరణకు,

నిరసన తెలియజేసిన వారిపై కాశ్మీర్‌లో 370 అధికరణం రద్దు సందర్భంలో, కరోనా లాక్‌డౌన్ కాలంలో భిన్నాభిప్రాయం వ్యక్తం చేసిన వారిపై మానవ హక్కులు తీవ్రంగా ఉల్లంఘించ బడ్డాయి. ఉత్తర ప్రదేశ్‌తో సహా బిజెపిపాలిత రాష్ట్రాల్లో పోలీసుల కర్కశత్వం అవధులు దాటింది. 2020లో ఇప్పటివరకూ దేశంలో 53 పోలీసు కష్టడీ మరణాలు, 861 జైళ్లలో మరణాలు, 46 పోలీసు ఎన్‌కౌంటర్ మరణాలు జరిగాయి. భిన్నాభిప్రాయం వ్యక్తపరిచిన వారిలో అనేక మందిని జైళ్లలో పెట్టారు. వారి ఆరోగ్యం క్షీణిస్తున్నా కరోనా పాజిటివ్‌తో బాధపడుతున్నా బెయిల్ ఇవ్వకుండా ప్రభుత్వం అడ్డుకుంటున్నది.

## రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి

మోడీ ప్రభుత్వం రాజ్యసభలో వ్యవసాయ బిల్లులు ఆమోదించుకున్న తీరు చూస్తే దోపిడీ వర్గాల మాట చెల్లుబాటు అయ్యే వరకు ప్రజాస్వామ్యం, చెల్లుబాటు కాదంటే నియంతృత్వమే. రాజ్యసభలో బిజెపి దాని మిత్రపక్షాలకు బలం లేదు. మోడీ మంత్రివర్గంలో భాగస్వామి శిరోమణి అకాలీదళ్ వ్యవసాయ బిల్లులను వ్యతిరేకించింది. మంత్రివర్గం నుండి బయటకు కూడా వచ్చేసింది. దీనితో రాజ్యసభలో ఎన్ డి ఎ మరింత బలహీన పడింది. అయినా బిల్లులు నెగ్గించుకోవాలనే యావతో మోడీ ప్రభుత్వం సభ్యులు కోరినా బిల్లులు సెలెక్ట్ కమిటీకి పంపలేదు. ఒక్కరు కోరినా బిల్లును ఓటింగుకు పెట్టాలి. మెజారిటీ సభ్యులు పట్టుపట్టినా ఓటింగుకు పెట్టకుండా బిల్లు పాస్ అయినట్లు సభాపతి ప్రకటించేశారు. ఈ అక్రమాన్ని అడ్డుకొని నిరోధించడానికి చేసిన ప్రయత్నం నేరమైనట్లు 8 మంది సభ్యులను సస్పెండ్ చేసి ఎదురు దాడికి బిజెపి దిగింది. పార్లమెంటరీ వ్యవస్థలో పద్ధతులన్నీ ఉల్లంఘించి మోడీ ప్రభుత్వం బిల్లును పాస్ చేసింది.

వాజ్ పేయి పాలనలోనే రాజ్యాంగాన్ని సమీక్షించాలని, అధ్యక్ష తరహా పాలనను గురించి చర్చను లేవనెత్తారు. ఆనాడు రాష్ట్రపతి కెఆర్ నారాయణన్ ఆ వాదనను తిప్పికొట్టారు. దేశంలో లౌకిక ప్రజాస్వామిక శక్తులన్నీ ఆయన వెంట నిలబడ్డాయి. మోడీ పాలనలో బిజెపి భారత రాజ్యాంగం పైనే దాడి కేంద్రీకరించింది. ఆర్ఎస్ఎస్ మూలాల్లో నుండి వచ్చిన రామ్ నాథ్ కోవింద్ రాష్ట్రపతి కావడంతో బిజెపి దేశంపై తన ఎజెండా రుద్దుతున్నది.

మోడీ ప్రభుత్వం అనేక విధాల కోర్టులను ప్రభావితం చేస్తున్నది. రాజ్యాంగాన్ని రక్షించాల్సిన సుప్రీం కోర్టు పౌరుల తీవ్ర విమర్శకు గురవుతున్నది. ఈ కాలంలో కాశ్మీర్, అయ్యప్ప గుడిలో మహిళల ప్రవేశం, అయోధ్య బాబ్రీ మసీదు, సి.ఏ.ఏ, తదితర అంశాలపై సుప్రీం కోర్టు తీర్పులు, వ్యవహరిస్తున్న తీరు అనుమానాస్పదంగా ఉన్నది. రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలులో అవినీతి ఆరోపణలు వెల్లువెత్తాయి. అవినీతి ఆరోపణల విచారణకు పూనుకోగానే సివిసి డైరెక్టర్‌ను రాత్రికి రాత్రే మోడీ తొలగించారు.

కేంద్రంలో ఆర్ఎస్ఎస్ పుత్రిక బిజెపి అధికారంలోకి వచ్చినదగ్గర్నుండి రాజ్యాంగంపై దాడి చేస్తోంది. మనువాదమే తన రాజ్యాంగం కనుక భారత రాజ్యాంగం బిజెపికి అంగీకారం కాదు. ఈ కాలంలో రాజ్యాంగాన్ని ధ్వంసం చేసేందుకు అన్ని విధాలా ప్రయత్నిస్తున్నది. స్వతంత్ర రాజ్యాంగ సంస్థలైన ఎన్నికల కమీషన్, సిబిఐ, ఈడి, సుప్రీం కోర్టుతో సహా అన్నింటి స్వతంత్రతను దెబ్బదీసి తన అదుపులో ఉంచుకుంటున్నది. సుప్రీం కోర్టు గత తీర్పులు, ఈ తీర్పు పాలక బిజెపి, ఆర్ఎస్ఎస్ సిద్ధాంతము ప్రభావం ఉన్నట్లు గోచరిస్తున్నది.

## మహిళలపై పెరిగిన దాడులు

బిజెపి పాలనలో మహిళల మానభంగాలు, అత్యాచారాలు, హత్యలు పెరిగాయి. వీటిని బిజెపి నేతలు, ప్రజాప్రతినిధులు బలపరుస్తున్నారు. ఆపైన ఇది తమ సంస్కృతిలో భాగమని నిస్సిగ్గుగా ప్రకటిస్తున్నారు. ఉత్తరప్రదేశ్, హత్రాస్ జిల్లాలో, మనీషా వాల్మీకి19 ఏళ్ల దళిత యువతిని నలుగురు అగ్రకుల యువకులు దారుణంగా అత్యాచారం చేసి చంపేశారు. చేసిన తప్పుకు సిగ్గుపడకుండా ఠాకూర్ కులపెద్దల నాయకత్వంలో ఆందోళనకు దిగారు. బిజెపి నేతలు నేరస్తులకు కొమ్ముకాస్తారు. కాశ్మీర్ లో తొమ్మిదేళ్ల బాలిక అశిఫాను గుడిలో బంధించి గుడి పూజారి, బిజెపి నాయకులు నెలరోజులు రేప్ చేసి చివరికి చంపేశారు. ఎట్టకేలకు అరెస్టు చేసి జైల్లో పెడితే నేరస్తులకు మద్దతుగా బిజెపి, హిందూ మతోన్మాదులు నిరసనకు దిగారు. దేరా బాబాలు, నిత్యానంద స్వామి తదితర బాబాలు, స్వాములు భక్తి ముసుగులో మహిళలపై చేస్తున్న అత్యాచారాలు, హత్యలకు అంతేలేదు. బిజెపి పితృస్వామిక వ్యవస్థను బలపర్చేది కావడం, మనువాదాన్ని బలపర్చేది కావడం వలన మహిళలపై అఘాయిత్యాలను బలపర్చడం వలన బిజెపి పాలిత రాష్ట్రాల్లో దుండగులు మరీ రెచ్చి పోతున్నారు.

## ప్రజలపై మోడీ ధరల దాడి

మోడీ ప్రభుత్వం పెద్ద నోట్లు రద్దు, జిఎస్‌టిలతో లక్షల ఉద్యోగాలు ఊడి పోయాయి. రైతులు దారుణంగా నష్టపోయారు. కరోనా వలన కోట్ల మంది ఉపాధి కోల్పోయారు. మోడీ ఆరేళ్ల కాలంలో ప్రజల ఆదాయం పెంపుదలకు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. కానీ పెట్రోల్, డీజిల్ ధరలతో పాటు అన్ని నిత్యావసరాల ధరలు 50% నుండి 100% వరకు పెంచేశారు. 2014 లో మోడీ అధికారం చేపట్టినప్పుడు ఒక బ్యారల్ ముడిచమురు 140 డాలర్లు ఉండగా ఒక దశలో దాని ధర 22 డాలర్లకు పడిపోయింది. కానీ డీజిల్ ధర లీటర్ రూ. 50/– నుండి రూ. 80/– కి పెంచేశారు. పెట్రోల్, డీజిల్ ధరలు పెంపుతో పప్పు, వంట నూనె సహా అన్ని నిత్యావసరాల ధరలు ఆకాశాన్ని తాకినవి. ఎరువులు, పురుగు మందులు ధరలు పెరిగాయి. బస్సు, రైల్ ఛార్జీలు 50% పెంచారు. పేపరు, పుస్తకాలు భారీగానే పెరిగాయి. నూలు, రంగులు పెరిగి చేనేతను కష్టం చేసింది. మందులు ధరలూ పెరిగాయి. విద్యా, వైద్యం ఖర్చు పెరిగింది.ప్రజల ఆదాయాలు తగ్గాయి. ప్రజల ఆదాయాలు పాతాళంలోకి తొక్కేసిన మోడీ అంబానీ, అదానీలను ఇదే కాలంలో ప్రపంచ కుబేరులుగా మార్చేశారు. కరోనా కాలంలో ప్రజలకు ఆర్థికంగా సహకరించని మోడీ కార్పొరేట్ల లక్ష కోట్లు రూపాయల బ్యాంకు రుణం మాఫీ చేసి ఎవరేమనుకున్నా బిజెపి కార్పొరేట్ల కోసమేనని రుజువు చేశాడు.

## దేశ యువతకు అన్యాయం

నరేంద్ర మోడీ సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తానని యువతకు హామీ ఇచ్చారు. పెద్ద నోట్లు రద్దు, జిఎస్టీ వలన ఎన్ని లక్షలు, కోట్లు ఉద్యోగాలు పోయాయో ప్రక్కన పెట్టేద్దాం. కేంద్ర ప్రభుత్వ సర్వీసులో రిటైర్‌అయిన లక్షల ఖాళీలను నింపకుండా మోడీ యువతకు ద్రోహం చేశారు. 2014లో 60781 మంది సిబ్బంది పదవీ విరమణ చేయగా నింపింది 28,467 మందినే. ప్రతి ఏడూ ఇంతే. రైల్వేలో దాదాపు 3 లక్షలు ఖాళీలు నింపకుండా యువతకు అన్యాయం చేశారు. రైళ్ళను ప్రైవేటుపరం చేసి యువతకు మోడీ శాశ్వత ద్రోహానికి ఒడిగట్టారు.

## కౌలు రైతులపై జగన్ దాడి

వైఎస్ రాజశేఖరరెడ్డి మార్గంలోనే పాలిస్తానన్న జగన్ మోహన్‌రెడ్డి అందుకు విరుద్ధంగా, రాజశేఖరరెడ్డి చేసిన “2011 కౌలు రైతుల చట్టాన్ని’ రద్దు చేసి దాని స్థానంలో 2019లో “ఆంధ్రప్రదేశ్ పంట సాగుదారుల హక్కుల చట్టం” చేసి కౌలు

రైతులకు తీవ్రమైన అన్యాయం చేశారు. మారిన చట్టంలో భూ యజమాని కౌలు ఒప్పందం రాసి ఇస్తేనే కౌలు రైతుకు గుర్తింపు కార్డు జారీ చేయాలనివుంది. దీంతో రాష్ట్రంలో 32 లక్షల కౌలు రైతుల హక్కు పోయినట్లయింది. ఏ భూ యజమానీ ఒప్పంద పత్రం ఇవ్వడం లేదు. కౌలు రైతుకు సిసిఆర్‌సి కార్డు రావడం లేదు. అందువల్ల కౌలు రైతుకు పంట రుణాలు బ్యాంకులు ఇవ్వడం లేదు. రైతు భరోసా రావడంలేదు. ఈ – క్రాప్ నమోదు చేయడం లేదు. అందుచేత ఉచిత పంటల బీమా పథకం కౌలు రైతులకు వర్తించడం లేదు. రేపు విద్యుత్ నగదు బదిలీ వర్తించదు. అన్ని విధాలా కౌలు రైతుకు జగన్‌మోహన్‌రెడ్డి నష్టం చేశారు.

## నిర్వాసితుల పునరావాసం

చంద్రబాబు తన ఐదేళ్ల పాలనలో ఒక్క ప్రాజెక్ట నిర్వాసితుల పునరావాసం చేయలేదు. వంశధార ర్వాసితులు కొంత సాధించుకోగలిగారు. వెలిగొండ, పులిచింతల, గండికోట తదితర ప్రాజెక్టు నిర్వాసితుల పునరావాసం పట్టించుకోలేదు. ముఖ్యంగా లక్షకుపైగా కుటుంబాలకు పునరావాసం కల్పించాల్సిన పోలవరం నిర్వాసితుల విషయంలో కూడా అదే వైఖరి చంద్రబాబు ప్రదర్శించారు. జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సభల్లో నేను గెలిస్తే న్యాయం చేస్తానని నిర్వాసితులక వాగ్దానం చేశారు. గతంలో సేకరించిన భూమికి కూడా 2013 భూసేకరణ చట్టం ప్రకారం భూమికి పరిహారం ఇస్తానని అన్ని ప్రాజెక్టు నిర్వాసితులకు హామీ ఇచ్చారు. గెలిచి 18 నెలలైనా తను ఇచ్చిన మాట నిలబెట్టుకొనే పనేమీ చేయలేదు.

పోలవరం నిర్వాసితుల పరిస్థితి మరీ విషాదం. ప్రాజెక్టు 70 శాతం పూర్తయింది. పునరావాసం మాత్రం 20 శాతం కూడా కాలేదు. గోదావరికి అడ్డంగా కాపర్‌డ్యాం కట్టడంతో గోదావరికి వరద వస్తే నిర్వాసిత గ్రామాలన్నీ మునిగిపోతున్నాయి. నిర్వాసితులకు పునరావాసం కల్పించే పునరావాస కాలనీలు ప్రాజెక్టు పూర్తయితే మునిగిపోతాయని తేలింది. మోడీ ప్రభుత్వం ప్రాజెక్టు నిర్మాణం తప్ప పునరావాసం బాధ్యత నాది కాదంటున్నది. చంద్రబాబు, జగన్‌మోహన్‌రెడ్డి ఇద్దరూ మోడీ ప్రభుత్వంపై పోరాడడంలేదు. ప్రాజెక్టులో పునరావాసం ఓ భాగం. 33 వేల కోట్లు కేంద్రం ఎగ్గొడితే, రాష్ట్ర ప్రభుత్వం ఆ భారం మోస్తుందా? నిర్వాసితులకు పునరావాసం కల్పిస్తుందా? ఇది చాలా ఆందోళనకర విషయం.

## వృత్తిదార్లపై మోడీ వేటు

మోడీకి పూర్వం వివిధ వృత్తులకు ఉన్న కేంద్ర ప్రభుత్వ పథకాలన్నింటినీ

మోడీ ప్రభుత్వం ఎత్తివేసింది. కొత్తగా ఏమీ పెట్టలేదు. మేకలు, గొర్రెల వృత్తిదారులకు రాష్ట్రీయ కృషి వికాస్ యోజన, బేడ్ పాలక్ బీమా యోజన, నేషనల్ లైవ్ స్టాక్ మిషన్, ఉన్నినేత కార్మికులకు 24 వేలు సబ్సిడీ పథకాలు ఉండేవి. చేనేతకు మహాత్మా బునకర్ యోజన, మత్యకర్మికులకు నేషనల్ ఫిషర్మన్ డెవలప్మెంట్ బోర్డ్ స్కీమ్ రద్దు చేసింది. మోడీ ప్రభుత్వం ముద్ర పథకంలో శిశు పథకం, కిషోర్ పథకం, తరుణీ పథకం ఏ ఒక్కటీ అమలు కావడం లేదు.

రాష్ట్ర ప్రభుత్వం జీవక్రాంతి, మినీ షీప్, మినీ గోట్ యూనిట్ పథకాలను నిలిపివేసింది. గొర్రెలు, మేకలకు మందుల బడ్జెట్ తగ్గించేసింది. సంవత్సరానికి 4 సార్లు డీ వార్మింగ్ మందు వేయాల్సింది  సంవత్సరం ఆరు నెలలైనా ఒకసారే వేశారు. సముద్రంలో పట్టిన చేపలకు వ్యాపారులు ధర తగ్గించేస్తున్నారు. స్వంత మగ్గం లేదని చేనేత కార్మికులకు 24 వేలు ఇవ్వలేదు. రజకులు, క్షౌర వృత్తిదారులకు లైసెన్స్, షాపులు లేవని ఆర్థిక సహాయం చేయలేదు. హుద్ హూద్ తుఫాను వలన నష్టపోయిన గీత కార్మికులకు ఇస్తామన్న నష్టపరిహారం విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో నేటికీ ఇవ్వలేదు.

## సమస్యల పరిష్కారానికై పోరాడాలి

ఇసుకను సమస్య చేసి భవననిర్మాణ కార్మికులకు పని లేకుండా చేశారు. కరోనా కాలంలో సహకరించలేదు. ప్రైవేట్ స్కూల్స్,కాలేజీలోనే గాక ప్రభుత్వ విద్యాసంస్థల్లో పనిచేసే కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, స్కీమ్ వర్కర్స్, సవర విద్యావాలంటీర్లకు జీతాలు ఇవ్వలేదు. అసంఘటిత రంగంలో పని చేస్తున్న కార్మికులను పట్టించుకోవడం లేదు. నవరత్నాలు అమలులో చేతి వృత్తులకు అన్యాయం జరిగింది. కౌలు రైతుకు గుర్తింపు కార్డు లేదు, రుణం లేదు. వరదల్లో జరిగిన నష్టానికి పరిహారం లేదు. పోలవరం, గండికోట సహా ప్రాజెక్టు నిర్వాసితులకు పునరావాసం కల్పించ లేదు. రాజధాని, ఎన్నికల కమిషన్, తెలుగు బోధనా మాధ్యమం అన్నింటా వివాదాలు సృష్టించి కోర్టులు చుట్టూ తిప్పుతున్నారు. పాలక పార్టీ, ప్రతిపక్షం బిజెపితో లాలూచీ పడుతున్న పరిస్తితుల్లో సమస్యలపై పోరాడుతూనే బిజెపి మతోన్మాద కుట్రలు పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సిపిఎం విజ్ఞప్తి చేస్తున్నది.

## ప్రజలను ప్రక్కతోవ పట్టించే బిజెపి కుట్రలు

హక్కులను హరించి యజమానులకు కట్టుబానిసలు చేయడాన్ని కార్మికులు

భరిస్తారా? పౌర హక్కులు హరించి జైళ్లలో బంధించడాన్ని ప్రజలు సహిస్తారా? రైతును కార్పొరేట్ బందీని చేసి, మార్కెట్ శక్తులు ధరలు పెంచి దారుణంగా దోచుకోడాన్ని రైతులు, ప్రజలు అంగీకరిస్తారా? మహిళలపై అఘాయిత్యాలు, దళితులు, మైనారిటీలపై క్రూరమైన దాడులను ప్రతిఘటించరా? నిరుద్యోగ యువత ఊరుకుంటారా? అన్ని విధాలా దేశ ప్రజలకు నష్టం చేస్తున్న మోడీ విధానాలపై ప్రజల ప్రతిఘటన తప్పదనే మతోన్మాదంతో ప్రజలను విభజించే కుట్రలు బిజెపి చేస్తున్నది.

ఒకచోట ముస్లిం వ్యతిరేకత, మరో చోట క్రిస్టియన్ వ్యతిరేకత, ఇంకోచోట కులాల విభజన, మరోచోట ప్రాంతీయ తత్వంతో ప్రజల మధ్య చిచ్చు రేపుతున్నది. ఘర్షణలతో జనం కొట్టుకుని బిజెపి ద్రోహంపై దృష్టి పెట్టరని, పైగా మెజారిటీ మతం పేరుతో ప్రజలను ఉన్మాదులను చేసి రాజకీయంగా బలపడ వచ్చనే కుట్రతో బిజెపి మత ఘర్షణలకు తెగబడుతున్నది. మన రాష్ట్రంలో బిజెపి మతోన్మాద కుట్రలు మొదలెట్టింది. చె గువేరా, అంబేద్కర్ పోజుపెట్టిన పవన్ కళ్యాణ్ బిజెపికి తోకగా మారారు. చంద్రబాబు మతోన్మాదిలా మాట్లాడుతున్నారు. సున్నితమైన మత సమస్యపై వైసిపి ప్రభుత్వం బాధ్యతగా వ్యవహరించడం లేదు. మూడు పార్టీలు బిజెపి కుట్రలకు తావిస్తున్నాయి.

## విభజన కుట్రలు తిప్పి కొట్టి ఐక్యత కాపాడుకోవాలి

రాష్ట్రానికి ప్రత్యేక హెూదా ఇవ్వని, విభజన హామీలు అమలు చేయకుండా ద్రోహం చేసిన బిజెపిని నిలదీయకుండా వైసిపి, టిడిపి బలపర్చడం ప్రజలకు హాని చేయడమే. టిడిపి, వైసిపి వంటి దోపిడీవర్గ పార్టీలు మతోన్మాదులతో చేతులు కలపగలవు. బిజెపి పరమ కిరాతకమైనది. దేవుడు, మతం పేరుతో హత్యలకు పురికొల్పుతున్నది. అబద్ధాలతో ప్రజలను మోసం చేస్తున్నది. ఎవరి మతం ఏదైనా, దేవుడు ఎవరైనా, కులం ఏదైనా కష్టజీవులకు ఐక్యతే ఆయుధం. దాంతోనే వారి హక్కులు రక్షించబడతాయి. దానికి విరుద్ధంగా ప్రజల విభజన దోపిడీదారులకు లాభం. అదే బిజెపి వ్యూహం. బిజెపి కుట్రలను తిప్పికొట్టి, ప్రజల మధ్య ఐక్యతను కాపాడడం, హక్కులను రక్షించుకోవడం, అభివృద్ధి సాధించడం మనందరి ఉమ్మడి కర్తవ్యం. ఆ కర్తవ్య సాధనకు ఐక్యంగా కదులుదాం.

*ముద్రణ :* **ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్,** విజయవాడ
website : www.psbh.in, prajasaktipublishinghouse@gmail.com

కేంద్రం ఆధిపత్యానికి వ్యతిరేకంగా రాష్ట్రాల హక్కులకై ఏర్పడ్డ పార్టీ టిడిపి. ఆ పార్టీ వ్యవస్థాపకుడు ఎన్‌టి రామారావు నాడు జ్యోతిబసు, ఫరూక్ అబ్దుల్లా, రామకృష్ణ హెగ్డే, తదితరులతో కలిసి రాష్ట్రాల హక్కులకై పోరాడారు. అటువంటి చరిత్ర కలిగిన టిడిపి కాశ్మీర్‌లో 370,35ఎ అధికరణాలను, రాష్ట్ర హోదాను రద్దు చేయడాన్ని బలపర్చిన హీనస్థితికి దిగజారింది. వ్యవసాయం, విద్యుత్, విద్య, వైద్యం మోడీ కేంద్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడాన్ని బలపరుస్తున్నది. జగన్ మోహన్ రెడ్డి కూడా కేంద్రం పెత్తనంపై పోరాడి రాష్ట్రానికి ప్రత్యేక హోదా తెస్తానని ప్రజలకు చెప్పి ఇపుడు రాష్ట్రాల హక్కులను బిజెపి హరిస్తుంటే దాని ముందు సాగిలపడ్డం రాష్ట్రానికీ, ప్రజలకూ ద్రోహం చేయడమే. పాలకులు ద్రోహులుగా మారినపుడు ప్రజలే పోరాడి హక్కులు కాపాడుకోవాలి.